ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 4
సంచిక : 114

సోమవారం 10 నవంబర్ 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD



యాదగిరికొండపై ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న దృశ్యం.



యాదగిరికొండపై ఆదివారం భక్తజనుల కోలాహలం.

గుట్టలో పోటెత్తిన భక్తులు

ఒక్క రోజే రూ.1,00,57,322 ఆదాయం

## గుట్ట శ్రీలక్ష్మీనరసింహునికి రికార్డు స్థాయి ఆదాయం

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం భక్తజనులతో పోటెత్తింది. గతంలో ఎన్నడూ లేని విధంగా శ్రీవారి ఖజానా కోటి రూపాయలు దాటింది. కార్తీకమాసం సందర్భంగా యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఆర్జిత పూజా కైంకర్యములు , మొక్కులు నిర్వహించారు. దేవస్థానంలోని వివిద విభాగాల ద్వారా శ్రీ స్వామి వారి ఖజానాకు ఆదివారం ఒక్క రోజే రూ. 1,00,57,322 ( ఒక కోటి యాభై ఏడు వేల మూడు వందల ఇరవై రెండు రూపాయలు మాత్రమే) ఆదాయం సమకూరినట్లు ఈఓ వెంకట్రావు తెలిపారు. ఈ ఆదాయం ఇటీవల కాలంలో నమోదైన అత్యధిక ఆదాయాలలో ఒకటిగా నిలిచింది. కార్తీక మాసము మూడవ ఆదివారం సందర్భంగా భక్తులు అత్యంత భక్తి శ్రద్దలతో కొండక్రింద శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతమండపము నందు 1758 జంటలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయం నందు 200 నం.లు వ్రతాలు మొత్తము 1958 జంటలు వ్రతాలు ఆచరించారు. ఈవో వెంకట్రావు, యాదగిరిగుట్ట ఏసీపీ పాలెగార్ శ్రీనివాస్ నాయుడు, ఎస్పీఎఫ్ సిఐ శేషగిరిరావు లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవస్థానం అధికారులు ఈఈ దయాకర్ రెడ్డి ఇతర అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లు వసతుల కల్పనలో నిమగ్నమయ్యారు. ఆధ్వర్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు ఏర్పాట్లు చేశారు.



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం శ్రీ సత్యదేవుని వ్రత పూజలు నిర్వహిస్తున్న భక్తులు



## బీఆర్ఎస్ వ్యాలిడిటీ అయిపోయింది

### జూబ్లీహిల్స్ ఓటర్లకు కేసీఆర్ ఎందుకు విజ్ఞప్తి చేయలేదు?

- దీన్ని బట్టి కేటీఆర్, హరీశ్‌పై ఆయన ఆలోచనను అర్థం చేసుకోవచ్చు
- ధృతరాష్ట్రుడిలా దుర్మార్గాల్ని భరిస్తున్నరు
- పార్టీ కూలుతుంటే కుమిలిపోతున్నరు
- ఈసారి ఎన్నికలు 2029 జూన్‌లో..
- 2034 వరకూ కాంగ్రెస్సే అధికారంలో..
- రానున్న పదేళ్లలో వందేళ్ల అభివృద్ధి చేసి చూపిస్తాం
- కేసీఆర్ పెట్టిన ఏ పథకాన్నీ ఆపలే
- గుజరాత్‌కు గులాముగా కిషన్‌రెడ్డి
- కేటీఆర్‌తో చెడు సావాసాన్ని ఆపాలి
- సెంటిమెంటా? డెవల్‌పమెంటా? జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించుకోవాలి
- కాలేజీలు నిబంధనల ప్రకారం పోదామంటే మేం సిద్ధం
- 'మీట్ ద ప్రెస్'లో సీఎం రేవంత్‌రెడ్డి



03

బీఆర్ఎస్ కాలగర్భంలో కలిసిపోతున్న పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ వ్యాలిడిటీ పీరియడ్ అయిపోయిందన్నారు. ఇదేమీ తాను రాజకీయ విమర్శ కోసం చెబుతున్నది కాదని, ఒకప్పుడు తెలంగాణలో బలంగా ఉన్న టీడీపీ ఇప్పుడు ఇక్కడ లేకుండా పోయిందని గుర్తు చేశారు. కేసీఆర్‌తోనే ఆ పార్టీ పని అయిపోతుం దన్నారు. కేసీఆర్‌కు గతమే తప్ప.. భవిష్యత్తు లేదని, ఆ బాధతోనే ఆయన బయటికి రావడంలేదని వ్యాఖ్యానించారు.



## జూబ్లీహిల్స్ తీర్పుతో రేవంత్ పీఠం కదలాలి

### గోస పడుతున్న తెలంగాణ మీ దిక్కు చూస్తోంది

### యూసుఫగూడ రోడ్ షోలో కేటీఆర్

'జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల తీర్పుతో సీఎం రేవంత్‌రెడ్డి పీఠం కదలాలి. నల్లగొండ, ఖమ్మం జిల్లాల మంత్రులు సీఎం కుర్చీ కోసం ఢిల్లీలో రేవంత్‌పై కత్తులు నూరుతున్నరు. మీరిచ్చే షాక్‌తో మూడేళ్లు కాదు.. మూడు నెలలు కూడా ఆయన పదవిలో ఉండే పరిస్థితి ఉండదు' అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.


03

## ప్రచారం ముగిసింది..

# పోలింగ్ మిగిలింది

### జూబ్లీపై ఒకే ధీమా ఎవరి లెక్కలు వారివే..


- 3 పార్టీల్లోనూ కొండంత ఆత్మవిశ్వాసం
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేవంత్, కేటీఆర్, కిషన్ రెడ్డి
- ఓటర్ల నాడిపై సర్వత్రా ఉత్కంఠ




ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఉత్కంఠ రేకెత్తిస్తున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారానికి ఆదివారం సాయంత్రంతో తెరపడింది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నువ్వా నేనా అనే రీతిలో తలపడిన ఈ ఉప ఎన్నిక ప్రచారంలో ఆయా పార్టీల ఉద్దండులు ప్రచారం నిర్వహించారు. మంగళవారం ఉదయం పోలింగ్ జరుగుతుండగా పార్టీల ముఖ్యనేతలు ఎన్నికల వ్యూహానికి పదును పెట్టారు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతుందన్న అనుమానం వ్యక్తంచేసిన బీఆర్ఎస్ ప్రత్యేక పోలీసు బలగాలను రంగంలోకి దింపాలని కేంద్ర ఎన్నికల కమిషన్ను కోరింది. మరోవైపు ఈ ఎన్నికలో భారీ ఎత్తున ఓటర్లను తరలించేందుకు అన్ని పార్టీలు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నాయి.

**రోమింగ్ న్యూస్, హైదరాబాద్ :** ఉప ఎన్నికలో 58మంది అభ్యర్థులు రంగంలోకి దిగగా ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ నెలకొంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హఠాన్మరణంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆయన సతీమణి సునీత బీఆర్ఎస్ పక్షాన బరిలోకి దిగగా కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ తరుపున దీపక్రి పోటీలో నిలిచారు. ఈ ఎన్నికలు మూడు ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా

మిగతా 2 లో




### నేడు పోలింగ్ సామాగ్రి పంపిణీ

- ఒక్కో బూత్లో 4 బ్యాలెట్ యూనిట్లు
- 407 పోలింగ్ కేంద్రాలు
- డ్రోన్లతో నిఘా..వెబ్ క్యాస్టింగ్

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
10 నవంబర్
2025




# సైబర్ నేరాలపై సమరం

**5 రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆపరేషన్**

**25 రోజుల్లో 81 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్**

**రూ.95 కోట్ల మోసపూరిత ఆర్థిక లావాదేవీల గుర్తింపు**

**నేరస్థుల్లో బ్యాంకు ఉద్యోగులు, విద్యావంతులు**

**నేర ముఠాల మౌలిక వసతులను ధ్వంసం చేయడమే లక్ష్యం**

**సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: టీజీసీఎస‌బీ**



**హైదరాబాద్, నవంబరు 9 :** సైబర్ నేరగాళ్లపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎసబీ) ఉక్కుపాదం మోపుతోంది. సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు దేశంలోనే తొలిసారిగా పలు రాష్ట్రాల్లో ఏకకాలంలో భారీ ఆపరేషన్ నిర్వహించింది. అక్టోబరులో 25 రోజులపాటు నిర్వహించిన ఈ సమన్వయదాడిలో మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో కలిపి మొత్తం 81 మందిని అరెస్ట్ చేసినట్లు టీజీసీఎసబీ తెలిపింది. కేరళలో 28 మంది, మహారాష్ట్రలో 23 మంది, ఆంధ్రప్రదేశ్‌లో 10 మంది, తమిళనాడులో ఏడుగురు, కర్ణాటకలో 13 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించింది. వారిలో పురుషులు 74, మహిళలు ఏడుగురు ఉన్నారు. వీరిలో బ్యాంకింగ్, కార్పొరేట్ రంగాల ఉద్యోగులు, విద్యావంతులు కూడా ఉండటం గమనార్హం. ఈ దాడుల్లో భాగంగా అధికారులు సుమారు రూ.95 కోట్ల మోసపూరిత ఆర్థిక లావాదేవీలను గుర్తించారు. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, 11 మంది నేరుగా ఆర్థిక లావాదేవీల్లో పాల్గొన్నవారు (రూ.34.70 లక్షలు), 53 మంది 'మ్యూల్ అకౌంట్' హోల్డర్లు ఉన్నారు. వీరి వద్ద నుంచి 84 మొబైల్ ఫోన్లు, 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్ బుక్‌లు, చెక్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు టీజీసీఎసబీ అధికారులు వెల్లడించారు.

**బ్యాంకు ఉద్యోగుల కక్కుర్తి**


కమీషన్లకు కక్కుర్తి పడి బ్యాంకుల వంటి ఆర్థిక కార్యకలాపాల్లో పనిచేసే పై స్థాయి ఉద్యోగులు సైతం ఈ నేరగాళ్లకు సహకరించడం విస్మయం కలిగిస్తోంది. అరెస్టయిన నిందితుల్లో ఐడీఎఫ్‌సీ బ్యాంకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ (106 కేసులతో లింక్), ఫెడరల్ బ్యాంకు ఉద్యోగి, బంధన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్, కంప్యూటర్ ఆపరేషన్స్ డిప్లొమా హోల్డర్ (96 కేసులు), చెన్నై కిల్‌పోక్ ఆడిట్ ఆఫీసులో అకౌంటెంట్ (31 కేసులు), బీబీఏ గ్రాడ్యుయేట్ (45 కేసులు), ఒక మల్టీనేషనల్ కంపెనీ ఉద్యోగి ఉన్నారు. కొంతమందికి విదేశాల్లోని నేర నెట్‌వర్క్‌లతో కూడా సంబంధముందని తేలింది. వారిని ఇక్కడికి తీసుకొచ్చేందుకు లుక్ ఔట్ సర్క్యులర్ జారీచేసే ప్రక్రియను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో అరెస్టయినవారు టీజీసీఎసబీకి చెందిన 7 సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో నమోదైన 41 కేసులతో సంబంధం ఉన్నవారని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 754 క్రైమ్ లింకులను గుర్తించగా, అందులో తెలంగాణలోనే 128 లింకులు బయటపడ్డాయి. ఈ ఆపరేషన్ ద్వారా సైబర్ నేరగాళ్లకు మద్దతిచ్చే సరఫరా గొలుసును పూర్తిగా విచ్ఛిన్నం చేయటమే లక్ష్యమని టీజీసీఎసబీ అధికారులు తెలిపారు. భారీ ఆపరేషన్‌ను విజయవంతం చేసిన అధికారులను టీజీసీఎసబీ డైరెక్టర్ శిఖా గోయల్ అభినందించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు టీజీసీఎసబీ సూచించింది. ముఖ్యంగా ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ ఉచ్చుల్లో పడొద్దని కోరింది. అధిక రాబడి ఇస్తామని చెప్పే ఆన్‌లైన్ స్టాక్, ఫారెక్స్, క్రిప్టో ట్రేడింగ్ యాప్స్, టాస్క్ బేస్డ్ ఇన్‌కమ్ ఆఫర్లను నమ్మవద్దని సూచించింది. అధికారికంగా ధృవీకరించిన వెబ్‌సైట్లు /యాప్‌లను మాత్రమే ఆర్థిక లావాదేవీలకు ఉపయోగించాలని, సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించింది.

# రాబోయే పది రోజులు గజగజే!

**రాష్ట్రంలో మరింత పెరగనున్న చలి తీవ్రత**

**11-19 తేదీల్లో పలు జిల్లాల్లో 10 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు**

**రాష్ట్ర ప్రణాళిక అభివృద్ధి సంఘం హెచ్చరిక**



**హైదరాబాద్, నవంబరు 9 :** తెలంగాణలో చలిపులి ఇప్పటికే మొదలైంది. రాత్రి ఉష్ణోగ్రతలు రోజురోజుకి పడిపోతున్నాయి. మూడు నాలుగు రోజుల వ్యవధిలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18-20 డిగ్రీల నుంచి 9-13 డిగ్రీల మధ్యకు చేరుకున్నాయి. అయితే, రాబోయే పది రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగబోతుంది. అవును.. నవంబరు 11-19 తేదీల వరకు అనగా రాబోయే పది రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత అధికంగా ఉండనుందని తెలంగాణ ప్రణాళిక అభివృద్ధి సంఘం ఆదివారం హెచ్చరించింది. ముఖ్యంగా 13-17 తేదీల మధ్య మరింత అధికంగా ఉంటుందని, కొన్ని జిల్లాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్ అంటే పది డిగ్రీల లోపునకు పడిపోనున్నాయని పేర్కొంది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో 10 డిగ్రీలోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించింది. సోమవారం నుంచి బుధవారం వరకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 9-15 డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది. ముఖ్యంగా ఆసిఫాబాద్, భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 9-10 డిగ్రీల మధ్య నమోదవుతాయని వెల్లడించింది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక, మిగిలిన జిల్లాల్లో 11-15డిగ్రీల మధ్య నమోదు అవుతాయని వెల్లడించింది. అలాగే, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 26-30డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది. కాగా, శనివారంరాత్రి ఆదిలాబాద్ జిల్లా అర్లీ(టీ)లో 14.7డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

**మరో తుపాను ముప్పు!**

విశాఖపట్నం: పసిఫిక్ మహాసముద్రం నుంచి వచ్చే తేమగాలుల ప్రభావంతో ఈ నెల 19 లేదా 20న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత పశ్చిమంగా పయనించే క్రమంలో ఇది బలపడి తుపానుగా మారుతుందని ఇస్రో వాతావరణ నిపుణుడు వెల్లడించారు. అనంతరం ఇది ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా దిశగా రానుందని అంచనావేశారు. దక్షిణ కోస్తా జిల్లాలపై దీని ప్రభావం ఉంటుందని విశ్లేషించారు. దీని కంటే ముందుగానే శ్రీలంక సమీపంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి.

# ప్రచారం ముగిసింది.. పోలింగ్ మిగిలింది


మొదటి పేజీ తరువాయి





తీసుకున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్‌లో పాగా వేయాలన్న పట్టుదలతో ప్రచారాన్ని హోరెత్తించింది. ముఖ్య మంత్రి రేవంత్రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరే షన్ ఛైర్మన్లు, ముఖ్యనేతలు జూబ్లీహిల్స్‌లోనే మకాం వేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల మాజీ ఛైర్మన్లు, ముఖ్యనేతలు, నియోజకవర్గంలోనే మకాం వేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యవ సాయక్షేత్రం నుంచి ఎన్నికల ప్రచారం జరుగుతున్న తీరు, పదేళ్లలో హైదరాబాద్ నగరాన్ని ఎలా అభివృద్ధి చేసింది ఆ వివరాలను ప్రజల్లోకి వెళ్లి చెప్పాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. బీజేపీ కూడా ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని కీలకనేతలను ప్రచారపర్వంలోకి దింపింది. కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్సభ పరిధిలోకి జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉండడంతో ఆయన కాలుకు బలపం కట్టుకుని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ అధ్యక్షుడు రాంచందర్రావు, రాజ్యసభఎంపీ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు రోజుకో డివిజన్లను ఎంపిక చేసుకుని ప్రచారం నిర్వహిం చారు. ముస్లిం మైనారిటీల అభివృద్ధి తమ హయాంలోనే జరిగిందని ఇరు పార్టీలు ప్రకటన చేసుకున్నాయి. ముస్లిం అంటేనే కాంగ్రెస్ కాంగ్రెస్ అంటేనే ముస్లిం అని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తన ప్రచార సభల్లో పేర్కొనగా ముస్లింలను కాంగ్రెస్ పార్టీ అవమాని స్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆరోపించారు. హిందువుగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ముస్లింల పాట పాడడం తగదని, తనకు ముస్లిం టోపీ పెట్టుకుని ప్రచారం చేయడం ఇష్టం లేదని, అదే పరిస్థితి వస్తే తల నరుక్కుంటానని కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్య లు కాస్త వివాదా స్పదమయ్యాయి.

**ఏకపక్షంగా ఓటింగ్ ఉండబోదు..**

ఈ ఎన్నికల్లో ఓటర్లు ఏకపక్షంగా ఓటు వేసే అవ కాశం లేదని రాజకీయ పరిశీలకులు విశ్లేశిస్తుంటే పరిస్థితి అలా ఉండదని ఓటర్లు ఎవరి పక్షాన నిలవాలో ఇప్పటికే నిర్ణయిం చుకున్నారని, ఆ విధంగానే ఎన్నికల ఫ లితాలు వెలువడు తాయని ఆయా పార్టీల ముఖ్యనేతలు చెబుతున్నా రు. అసెంబ్లీ ఎన్నికల్లో నిర్వహించిన ప్రచారం కన్నా మిన్నగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అన్ని పార్టీలు సవాల్ గా తీసుకుని ప్రజలను కలిశాయి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే బీఆర్ఎస్ తమ పార్టీ అభ్యర్థిని ప్రకటించి ఎన్నికల ప్రచార బరిలోకి దిగగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రకటన ఆలస్యమైనా అప్పటి నుంచి ఆ పార్టీ అధినాయం "త్వం మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలను నియోజకవర్గం లో మోహరించి ప్రచారం నిర్వహించింది. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి అభ్యర్థిత్వ ప్రకటనలో ఆలస్యం కావడం, ద్వితీయ శ్రేణి నాయకులం తా తొలుత ప్రచారంలో పాల్గొనడం, అనంతరం కీలక నేతలు ప్రచారం లోకి దిగడంతో ప్రచారం హోరెత్తింది. అయితే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, దీంతో ప్రజలు ఆయనపై ఆగ్రహంతో ఉన్నారని ఈ ఉప ఎన్నికలో వారు దిమ్మతిరిగే సమాధా నం చెబుతారని బీఆర్ఎస్ లెక్కలు వేస్తుంటే, విజయం ఖాయమైందని మెజారిటీపైనే దృష్టి సారించామని, మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీ రామారావు జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని గాలికొదిలేశారని, అభివృద్ధి ఆయనకు ఏ మాత్రం పట్టలేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు గుప్పించింది. ఈ రెండు పార్టీల అసలు రంగు బయటపడుతుందని, ఈరెండు పార్టీలు ఏకమై తమ పార్టీ అభ్యర్థి దీపక్ రెడ్డిని ఓడించే ప్రయత్నం చేశాయని బీజేపీ ఈ ఎన్నికల్లో ఆరోపించింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 90శాతం ఓటర్లు మురికివాడల్లో ఉండడం వీరిలో ఎక్కువ మంది రోజు వారీ కూలీలు, దినసరి ఉద్యోగులు కావడంతో ని అన్ని పార్టీలు ఆ ఓట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. మొత్తం మీద జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రసవత్తరంగా జరిగే అవకాశం కనిపిస్తోంది. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఆయా పార్టీలు ప్రణాళికలు రూపొం ని దించుకునే పనిలో పడ్డాయి. కనీసం 60 నుంచి 70శాతం ఓటింగ్ నమోదయ్యేలా చేయాలని మంగళవారం ఉదయమే ఓటర్లకు తమకు కేటాయించిన బూత్లకు వెళ్లి ఓటు వేసేవిధంగా ఏర్పాట్లు చేయాలని, ఇందుకు ఆయా బూత్ కమిటీల బాధ్యులు కీలక పాత్ర పోషించాలని దిశానిర్దేశం చేశాయి.

**సవాళ్లు, ప్రతిసవాళ్లతో..**

సవాళ్లు, ప్రతిసవాళ్లు, ఆరోపణలు- ప్రత్యారోపణలతో ఉప ఎన్నిక ప్రచారం తారాస్థాయికి చేరింది. ప్రచారానికి ఆదివారం గడువు కావడంతో అన్ని పార్టీల నాయకులు మోహ రించి తమదైన శైలిలో ప్రచారం నిర్వహించారు. చివరి రోజున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్లెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్కుమార్ గౌడ్ ప్రచారంలో పాల్గొనగా.. బీఆర్ఎస్ తరుపున ఆ పార్టీ వర్కింగ్ ప్రె సిడెంట్ కేటీ రామారావు యూసుఫ్గూడలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం,సీఎంపై తీవ్రస్థాయిలో ఇచ్చిన హామిలను రికార్డు చేసిన వీఆర్ఎస్ వాటిని ఎన్నికల ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రచార సభల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. టెలివిజన్లను ఏర్పాటు చేసి సీఎం రేవంత్ చేసిన ప్రసంగాన్ని ప్రదర్శించింది. దేశంలో ఏ రాజకీయపార్టీ తాము చేసిన విధంగా వినూత్న ప్రచారాన్ని ఇప్పటి వరకు చేయలేదని, ఆ ఘనత తమదేనని కేటీఆర్ చెప్పారు. హైదరాబాద్ రహదారుల అభివృద్ధికి, మౌళిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించిం దని, ఆ నిధులతోనే అభివృద్ధి సాధ్యమైందని ఆ పార్టీ నేతలు కిషన్రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్ ఇతర నేతలు చెప్పారు.

# నేడు పోలింగ్ సామాగ్రి పంపిణీ

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీల ప్రచారం ముగియడంతో పోలింగ్కు ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఉప ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్దేశించేందుకు ఇక ఓటరు తీర్చే మిగిలి ఉంది. ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మొత్తం 58 మంది పోటీ పడుతున్న ఈ ఉపఎన్నికల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్కాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లుగా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణణ్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 4 లక్షలకుపైగా ఓటర్లు ఉండగా 139 ప్రాంతాల్లో 407 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సాధారణ ఎన్నికల్లో కంటే ఈ ఉప ఎన్నికలో ఓటింగ్ శాతం పెరుగుతుందని ఎన్నికల సంఘం భావిస్తోంది. బీఆర్ ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హఠాన్మరణంతో ఖాళీ అయిన ఆ స్థానంలో ఉప ఎన్నిక నవంబర్ 11వ తేదీన జరగనుంది. ఇందుకోసం జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు జరిగాయి. ఈ ఉపఎన్నికలో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు పెద్దసంఖ్యలో స్వతంత్రులు, రైతులు, వివిధ పార్టీల నాయకులు పోటీపడుతున్నారు.

**మొత్తం 4,01365 మంది ఓటర్లు...**

మొత్తం 58 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా నియోజకవర్గ పరిధిలో మొత్తం 4,01365 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 2 లక్షల 85 వేల 61 మంది పురు షులు, లక్ష 92 వేల 779 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 25 మంది, సర్వీసు ఓటర్లు 18, ఎన్‌ఆర్‌ఆ ఓటర్లు 123, దివ్యాంగులు 1,908 ఉన్నారు. 18 నుంచి 19 ఏళ్లు ఉన్న ఓటర్లు 6,859 మంది ఉండగా 80ఏళ్లు పైబడిన వారు 6,053 మంది 85ఏళు పైబడిన వారు 2,134 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే వృద్ధులకు సంబంధించిన ఓటింగ్ లో దరఖాస్తు చేసుకున్న 103 మంది తమ హక్కు వినియోగించుకున్నారు.

**డ్రోన్లతో నిఘా...**

ఈ ఉప ఎన్నికలో 139 ప్రాంతాల్లో తొలిసారి డ్రోన్లతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. ఉపఎన్నిక కోసం 407 పోలింగ్ కేంద్రాల సిద్ధం చేయగా, అందులో 226 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు.

**అంతమంది పోటీ చేయడం ఇదే తొలిసారి...**

జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఐదోసారి జరుగుతున్న ఎన్నికల్లో 58 మంది పోటీ చేయడం ఇదే తొలిసారి. 2023లో జరిగిన ఎన్నికల్లో 19మందిఅభ్యర్థులు పోటీ పడగా ప్రధాన పార్టీల మధ్యత్రిముఖ పోరు హోరాహోరీగా జరిగింది. ఎన్నికల బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉండటంతో ఒక్కో బూ త్ మొత్తం 4 బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. కోట్ల విజయ్భా స్కర్రెడ్డి స్టేడియంలో ఎన్నికల సామ గ్రిని సోమవారం పంపిణీ చేయను న్నారు. నియోజకవర్గంలో మొ త్తం 407 పోలింగ్ స్టేషన్లు ఉం డగా అన్నింట్లో వెబ్కాస్టిం గ్ అమలు చేస్తున్నారు. 226 సమస్యాత్మక పోలిం గ్ కేంద్రాలలో బలగాలను మోహరించారు. ప్రచార ప ర్వం ముగిసిన వెంటనే పారా మిలిటరీ బలగాలను రంగంలోకి దింపి బందోబస్తుకు ఆదేశించారు. విధుల్లో మొత్తం 2,060 మంది పోలింగ్ సిబ్బంది ఉండనున్నారు. జీహెచ్ ఎంసీ ఆఫీస్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయగా.. పోలింగ్ ముగిసేవరకు నియోజ కవర్గ వ్యాప్తంగా మద్యం షాపులు మూసి వేయాలని ఆదేశాలు జారీ చేశారు. 144 సెక్షన్ను పటిష్టంగా పోలీస్ శాఖ అమలు చేస్తున్నది.

# వెల్‌నెస్ కేంద్రాలు.. ఇక డీఎంఈ పరిధిలోకి..

**ఖైరతాబాద్, కూకట్‌పల్లి కేంద్రాలు నిమ్స్‌కు**

**వైద్యేతర సిబ్బంది నియామకం ఆరోగ్యశ్రీకి**

**నేడు అధికారికంగా అప్పగింత**

**హైదరాబాద్, నవంబరు 9 :** ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు నగదురహిత వైద్యసేవలందించే వెల్‌నెస్ కేంద్రాలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ ట్రస్టు పర్యవేక్షణలో ఉన్న వెల్‌నెస్ సెంటర్ల పరిపాలన, నిర్వహణ బాధ్యతలను ఇకపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ), నిమ్స్ పరిధిలోకి తెచ్చింది. ఈ కేంద్రాల నిర్వహణను ఆయా విభాగాలకు సోమవారం అధికారికంగా అప్పగించనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. ముఖ్యంగా వెల్‌నెస్ సెంటర్లలో స్పెషలిస్టు వైద్యుల కొరత తీవ్రంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సమస్య పరిష్కారంతోపాటు ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచడానికి ఈ పరిపాలనా మార్పు దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. తెలంగాణవ్యాప్తంగా ఉన్న 12 వెల్‌నెస్ కేంద్రాల్లో.. పదింటిని వైద్య విద్య సంచాలకులకు, మరో రెండింటిని నిమ్స్ ఆస్పత్రికి పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. వెల్‌నెస్ కేంద్రాల నిర్వహణ విషయంలో నిర్ణయం తీసుకోవాలని ట్రస్ట్ సీఈవో ఇటీవల రాసిన లేఖ మేరకు.. ప్రభుత్వం తాజాగా జీవో నంబరు 204 జారీ చేసింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, కూకట్‌పల్లి వెల్‌నెస్ కేంద్రాలు నిమ్స్ పరిధిలోకి రాగా, ఇక ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, వనస్థలిపురం (రంగారెడ్డి జిల్లా), హన్మకొండలోని వెల్‌నెస్ కేంద్రాలు డీఎంఈ పరిధిలోకి వచ్చాయి.

**తీరనున్న వైద్య నిపుణుల కొరత..**

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వెల్‌నెస్ కేంద్రాలకు 2వేల వరకు ఓపీ(ఔట్ పేషెంట్) వస్తుంది. నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటే ఓపీల సంఖ్య 3000-4000 మధ్య నమోదయ్యే అవకాశం ఉంటుంది. వాస్తవానికి వెల్‌నెస్ కేంద్రాల్లో సుమారు 10-12 రకాల స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండాలి. కానీ, ప్రభుత్వం ఇచ్చే వేతనాలకు వైద్యులెవ్వరూ ఇక్కడ పనిచేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటిదాకా జిల్లాల్లో స్పెషలిస్టులు లేక అంతా హైదరాబాద్ నిమ్స్‌కు రావాల్సిన పరిస్థితి. దీంతో వైద్యుల కొరతపై నిత్యం వైద్యశాఖకు అందుతున్న ఫిర్యాదులను అధిగమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న స్పెషలిస్టు వైద్యులను వెల్‌నెస్ సెంటర్లకు అనుసంధానం చేయడం ద్వారా వైద్య కళాశాలలు, వాటి అనుబంధ ఆస్పత్రుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకునే అవకాశం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్లకు వచ్చే రోగులకు కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, ఆర్థోపెడిక్ వంటి వివిధ విభాగాల వైద్య సలహాలు, చికిత్సలు సులభంగా అందుబాటులోకి రానున్నాయి. దీంతో, ఉద్యోగులు పెన్షనర్లు వైద్యసేవల కోసం ప్రైవేటు ఆస్పత్రులపై ఆధారపడాల్సిన అవసరం గణనీయంగా తగ్గనుందని అంచనా వేస్తున్నారు. ఈ స్పెషాలిటీ వైద్యులందర్నీ బోధనాస్పత్రుల నుంచి రోస్టర్ పద్ధతిలో వెల్‌నెస్ కేంద్రాలకు పంపుతారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు విధులు నిర్వహించాల్సి వుంటుంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం మేరకు వైద్యేతర సిబ్బంది నియామకాలన్నీ ఆరోగ్యశ్రీ ట్రస్టు పర్యవేక్షిస్తుంది. అంటే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీస్ అసిస్టెంట్లు వంటి పరిపాలనా సిబ్బందిని రాజీవ్ హెల్త్‌కేర్ ట్రస్టు నియమిస్తుంది.

**నిధుల వినియోగం ఇలా..**

కాగా, వెల్‌నెస్ కేంద్రాల నిర్వహణకు అయ్యే వ్యయాన్ని ఉద్యోగులు, జర్నలిస్టు ఆరోగ్య పథకం (ఈజేహెచ్‌ఎస) కోసం కేటాయించిన బడ్జెట్ నుంచే భరించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక పరికరాలు, మందులు కొనుగోలు, మరమ్మతులు వంటి వాటికయ్యే ఖర్చులను ఆరోగ్య పథకాల కింద ఉన్న అడ్మినిస్ట్రేటివ్ నిధులను వినియోగించి ఆరోగ్యశ్రీ ట్రస్టే ఖర్చు చేయనుంది. కాగా, కొత్తగా వచ్చే వైద్య సిబ్బందికి వేతనాలివ్వాల్సిన ఆర్థిక భారం ట్రస్టుపై ఉండదు. అదే సమయంలో, పెరిగే అవుట్ పేషెంట్‌కు అనుగుణంగా ఇవ్వాల్సిన ఔషధాల ఖర్చు మాత్రం భారీగా పెరిగే అవకాశం ఉంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం
10 నవంబర్
2025





# కొండా నిండా భక్తులే

**కార్తీక భక్తులతో పోటెత్తిన యాదగిరిగుట్ట**

**యాదగిరిగుట్ట, పాతగుట్ట కలిపి ఒక్కరోజే 1958 వ్రతాలు**

**ధర్మదర్శనానికి 5, స్పెషల్ దర్శనానికి 2 గంటల సమయం**

**ఆదివారం రికార్డుస్థాయిలో రూ.1 కోటి 57 వేల ఆదాయం**





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం కార్తీక భక్తులతో పోటెత్తింది. కార్తీకమాసానికి తోడు ఆదివారం హాలీడే కావడంతో.. కార్తీక పూజలు జరిపించుకుని మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయానికి కార్తీక కళ సంతరించుకుంది. కార్తీక దీపారాధన, సత్యనారాయణస్వామి వ్రతాల్లో భక్తులు భారీగా పాల్గొని తరించారు. రద్దీ కారణంగా స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వెయిట్ చేయాల్సి వచ్చింది. ధర్మదర్శనానికి 5, స్పెషల్ దర్శనానికి 2 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఇక కార్తీక పూజలు నిర్వహించుకోవడానికి వచ్చిన భక్తులతో శివాలయం, కార్తీక దీపారాధన, వ్రత మండపాలు సందడిగా మారాయి. శివాలయంలో శివకేశవులకు రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన.. వ్రత మండపంలో సత్యదేవునికి వ్రత పూజలు నిర్వహించారు.

## సత్యదేవుడికి ఒక్కరోజే 1958 వ్రతాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం ఒక్కరోజే 1958 మంది భక్తులు సత్యదేవుడికి వ్రత పూజలు నిర్వహించుకుని కార్తీక మొక్కులు తీర్చుకున్నారు. యాదగిరిగుట్టలో 1758, పాతగుట్టలో 200 కలిపి ఆదివారం ఒక్కరోజే 1958 మంది దంపతులు వ్రతాలు జరిపించుకున్నారు. సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో రావడంతో.. వ్రత టికెట్ల క్యూలైన్లు నిండి ఘాట్ రోడ్డు సర్కిల్ వరకు భక్తులు బారులు తీరారు. వ్రత టికెట్ల కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. వ్రత పూజల నిర్వహించుకునే భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో.. ఆలయ అధికారులు ఆరు బ్యాచులకు బదులు ఏడు బ్యాచుల్లో వ్రతాలు చేపట్టారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్విరామంగా వ్రతాలు నిర్వహించారు. మొదటి బ్యాచ్ లో 267, రెండో బ్యాచ్ లో 275, మూడో బ్యాచ్ లో 260, నాలుగో బ్యాచ్ లో 230, ఐదో బ్యాచ్ లో 260, ఆరో బ్యాచ్ లో 308, ఏడో బ్యాచ్ లో 158 కలిపి 1758 మంది దంపతులు, పాతగుట్టలో 200 మంది జంటలు వ్రత పూజలు జరిపించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యాదగిరిగుట్ట, పాతగుట్ట కలిపి ఆదివారం కేవలం వ్రతాల నిర్వహణ ద్వారానే రూ.19.58 లక్షలు ఆదాయం సమకూరింది. ఇక కొండపైన ప్రధానాలయం, శివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపారాధన మండపాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

## ఆలయ ఖజానాకు రికార్డుస్థాయిలో రూ.1 కోటి 57 వేల ఆదాయం

యాదగిరిగుట్ట నర్సన్న సన్నిధికి తండోపతండాలుగా తరలివచ్చిన



భక్తులు జరిపించిన కార్తీక మొక్కు పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రికార్డుస్థాయిలో రూ.1 కోటి 57 వేల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వెంకటరావు తెలిపారు. పలు రకాల పూజల నిర్వహణ ద్వారా ఆదివారం ఒక్కరోజే ఆలయానికి రూ.1,00,57,322 ఆదాయం వచ్చింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.27,43,220, వ్రతాల ద్వారా రూ.19.58 లక్షలు, వీఐపీ దర్శనాలతో రూ.16.95 లక్షలు, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.9.17 లక్షలు, బ్రేక్ దర్శనాల ద్వారా రూ.8,01,600 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

## తప్పిపోయిన చిన్నారుల అప్పగింత

యాదగిరిగుట్ట నారసింహుడి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ కారణంగా తప్పిపోయిన పలువురు చిన్నారులను ఎస్పీఎఫ్ పోలీసులు తిరిగి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హైదరాబాద్ దూల్ పేట మంగళ్ హట్ కు చెందిన అక్షర, మార్కెట్ మండి గౌలీపురంకు చెందిన రత్నావతి, నారాయణపేట్ జిల్లా మక్తల్ కు చెందిన వెంకటేష్.. భక్తుల రద్దీ కారణంగా అనుకోకుండా కుటుంబ సభ్యుల నుండి తప్పిపోయారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసిన ఎస్పీఎఫ్ సీఎస్ఓ శేషగిరిరావు గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా తప్పిపోయిన చిన్నారులను గుర్తించి కంట్రోల్ రూం వద్దకు తీసుకువచ్చారు. మైక్ అనౌన్స్ మెంట్ చేపించి చిన్నారులను వారి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. తప్పిపోయిన తమ పిల్లలను వెతికి సేఫ్ గా తిరిగి తమకు అప్పగించిన ఎస్పీఎఫ్ పోలీసులకు కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

















ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
10 నవంబర్
2025





# కబడ్డీ నేషనల్ టీంకు గుట్ట ఎస్.వీ.ఎన్ స్టూడెంట్స్





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: తెలంగాణ స్టేట్ ఇంటర్ స్కూల్ కబడ్డీ ఛాంపియన్ షిప్‌బి 2025 పోటీల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్ నైన్త్ క్లాస్ స్టూడెంట్స్ జి. రాకేష్, డి. శ్రీకాంత్, కే. సాయిప్రకాష్ లు నేషనల్ లెవెల్ పోటీలకు ఎంపికయ్యారు. గోవా లేదా మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో ఈ ముగ్గురు విద్యార్థులు పాల్గొననున్నారు. హైదరాబాదులో నిర్వహించిన స్టేట్ లెవెల్ కాంపిటీషన్స్ లో ఎస్.వీ.ఎన్ స్టూడెంట్స్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నేషనల్ కు ఎంపికయ్యారని ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్ ఫౌండర్, కరస్పాండెంట్ గొట్టిపర్తి భాస్కర్ తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆటల్లో కూడా చక్కటి శిక్షణ ఇవ్వడం ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారని చెప్పారు.





ఒకవైపు కరికులం మరోవైపు కోకరిక్యులర్ యాక్టివిటీస్... వీటన్నిటి మేలు కలయికగా ఐఐటి లను అందిస్తున్న ఏకైక విద్యాసంస్థ ఎస్.వీ.ఎన్ విద్యాసంస్థ అని ఆయన కొనియాడారు. రాష్ట్రస్థాయిలో 25 టీంలను ఓడించి అగ్రస్థానంలోకి తీసుకువెళ్లడంలో రాకేష్, శ్రీకాంత్, సాయిప్రకాష్ లు ప్రతిభ కనబరిచారని ఆయన అభినందించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ గొట్టిపర్తి మాధురి, డైరెక్టర్ గొట్టిపర్తి వృతిక్ లు కూడా అభినందించారు. ఎస్వీఎన్ హాస్టల్లో రెండవ తరగతి నుంచి విద్యను అభ్యసిస్తున్న రాకేష్, శ్రీకాంత్, గుట్ట పట్టణానికి చెందిన సాయి ప్రకాష్ లు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడా ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.



# జనగామ ప్రెస్టన్ కాలేజ్ మాజీ ప్రిన్సిపల్ మృతి

## జనగామ బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదంలో స్పాట్ డెడ్



జనగామ నవంబర్ 9: (రోమింగ్ న్యూస్ ) : జనగామలో దాదాపు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రిస్టన్ ఇనిస్ట్యూట్ విద్యాసంస్థలలో మాజీ ప్రిన్సిపల్ గా పనిచేసిన భూపల్లి నాథనియేల్ ఆదివారం రాత్రి జనగాం లో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మ-రణించారు . ఆదివారం తరిగొప్పుల మండలంలో జరిగిన క్రైస్తవ సేవా కార్యక్రమంలో పాల్గొని ఆదివారం రాత్రి జనగామ కు చేరుకొని కొద్ది నిమిషాల్లో ఇంటికి చెరుకునే దశలో నెహ్రూ పార్క్ వద్ద గల బ్రిడ్జిపై స్కూటర్ పై జనగామ కు తిరిగి వస్తుండగా ఎదురుగా తప్ప తాగి డ్రైవింగ్ చేస్తున్న ఒక యువకుడు ఈయన వాహనాన్ని ఢీకొనడంతో రోడ్డుపై ఎగిరిపడి తలకు తీవ్ర గాయం కావడంతో రక్తస్రావం జరిగి ఆయన అక్కడికక్కడే మరణించారు. ఏసుప్రభు సేవలో సదా నిమగ్నమై ఉండే ఆయన పేద ప్రజల అవసరాలను తీర్చడానికై తన శక్తి మేరకు అహర్నిశలు కృషి చేస్తూ క్రైస్తవులతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారిలో ఆయనకంటూ ఒక గొప్ప స్థానాన్ని ఏర్పరచుకున్నారు ఇటు క్రైస్తవ మత ప్రచారకులు గానే కాకుండా విద్యా వ్యవస్థలో విద్యార్థులకు ఆయన ఇచ్చిన మార్గదర్శకం, జ్ఞానం, చరిత్రపై ప్రేమ, మరియు మినిస్ట్రీపై ఉన్న అభిరుచిని తలుచుకుంటూ విద్యార్థులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. మరణ వార్త తెలిసిన వెంటనే అనేకమంది క్రైస్తవులతో పాటు ఆయన విద్యార్థులు తీవ్రంగా కలత చెందుతున్నారని ఆయన ప్రియ శిష్యుడు, క్రిస్టియన్ నాయకులు రాజ్‌కుమార్ రోడ్రిక్స్, తోపాటు అనేకమంది క్రైస్తవ పెద్దలు తమ సంతాపం తెలుపుతూ నివాళు లర్పించారు. ఆయన చూపిన దయ, నిబద్ధత, ప్రేమ విలువలు విద్యార్థుల జీవితాలను ఎల్లప్పుడూ ప్రేరేపిస్తూనే ఉంటాయి అని, పిల్లల హృదయాల్లో ఆయన శాశ్వతంగా నిలిచిపోతారు అని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు స్కూల్ విద్యార్థులు తెలిపారు .

# ఆలయ భద్రత, భక్తుల రక్షణ కోసం బ్యాగేజ్ స్కానర్లు

## యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవో వెంకటరావు





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల రక్షణ, ఆలయ భద్రత దృష్ట్యా యాదగిరిగుట్టలో త్వరలో బ్యాగేజీ స్కానర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ ఈవో వెంకటరావు తెలిపారు. బ్యాగేజ్ స్కానర్ల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై యాదగిరిగుట్ట డివిజన్ ఏసీపీ శ్రీనివాస్ నాయుడుతో కలిసి కొండపైన, కొండ కిందా ఆదివారం విస్తృత తనిఖీలు చేశారు. బ్యాగేజ్ కౌంటర్ల స్థాపన, వినియోగం వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కొండపైన ఉన్న హాస్పిటల్ ను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండపైకి వెళ్లే ప్రతి వాహనం పూర్తిగా స్కానింగ్ చేయబడేలా స్కానర్లు ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేయడం కోసం ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ కమిటీ ద్వారా ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రాంతాల్లో బ్యాగేజ్ స్కానర్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. ఇక కొండపైన, కొండ కిందా వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, మెరుగైన పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు.రోజురోజుకు ఆలయానికి భక్తుల రాక పెరుగుతున్న నేపథ్యంలో.. భద్రతా ఏర్పాట్లు మరింత కఠినతరం చేయాలని, ప్రతి వాహనం, ప్రతి భక్తుని ప్రవేశ సమయంలో స్కానింగ్ తప్పనిసరి చేయాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ సమస్యల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టి, భక్తుల రాకపోకలు ఈజీగా జరిగేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఇక కొండపైన ఉన్న హాస్పిటల్ వద్ద అంబులెన్స్, అత్యవసర వైద్య సేవలు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణీ స్త్రీల సౌకర్యార్థం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల సౌకర్యం, భద్రత కల్పించడం ప్రధాన లక్ష్యమని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ దయాకర్ రెడ్డి, ఇంఛార్జ్ డిప్యూటీ ఈవో జూషెట్టి కృష్ణ గౌడ్, ఏఈవోలు గజవెల్లి రఘు, శంకర్ నాయక్, యాదగిరిగుట్ట టౌన్ సీఐ భాస్కర్, ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

# విదేశీ పర్యటన ద్వారా ఆలయానికి ఎంత ఆదాయం వచ్చిందో బహిర్గతం చేయండి.!

## ఆలయ ఈవో వెంకటరావుకు వినతిపత్రం అందించిన బీజేపీ నాయకులు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: లక్ష్మీనరసింహస్వామి కల్యాణం పేరుతో ఆలయ అధికారులు, అర్చకులు చేసిన విదేశీ పర్యటనల ద్వారా యాదగిరిగుట్ట ఆలయానికి ఎంత ఆదాయం వచ్చిందో భక్తులకు బహిర్గతం చేయాలని యాదగిరిగుట్ట బీజేపీ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు కొండపైన ఆలయ ఈవో వెంకటరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా స్వామివారి కల్యాణం పేరుతో కొందరు ఆలయ ఉన్నతాధికారులు నెలల తరబడి విదేశాల్లో పర్యటిస్తున్నారని, కానీ ఆ పర్యటన ఆలయ ఖజానాకు ఎంత అమ్దానీ వస్తుందో ఎందుకు బహిర్గతం చేయడం లేదని ప్రశ్నించారు. విదేశాల్లో నారసింహుడి కల్యాణం పేరుతో ఆలయ చైర్మన్ సహా డిప్యూటీ ఈవో, ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, అర్చక బృందం.. గత నెల రోజుల నుండి యూకేలో పర్యటిస్తోందని, తద్వారా యాదగిరిగుట్ట దేవస్థానంలో పాలనా వ్యవస్థ కుంటుపడి భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్తీకమాసంలో యాదగిరిగుట్ట టెంపుల్ కు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని ముందే తెలిసినా.. విదేశీ పర్యటనకు ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను సముద్రాలు దాటి విదేశాలకు తీసుకెళ్లడం, విదేశాలకు వెళ్లిన స్వామివారి విగ్రహాలను ముట్టుకునే అర్చకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఆలయ రూల్స్ కు విరుద్ధంగా మూడేళ్ల పాటు పొడిగించిన లక్ష్మీనరసింహస్వామి వస్త్రాల టెండర్ ను వెంటనే రద్దు చేయాలన్నారు. అదేవిధంగా ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఆలయ ఎలక్ట్రికల్ ఈఈ రామారావును విధుల నుంచి శాశ్వతంగా తొలగించి, లోతైన విచారణతో అక్రమాస్తులు గుర్తించి ఆలయానికి అటాచ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే చింతపండు చోరీ, ఎల్ఈడీ స్క్రీన్ల విషయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి అసలు దోషులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గుంటుపల్లి సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి నరేష్, కార్యదర్శి సురేష్, ప్రభాకర్, సత్యనారాయణ, సీనియర్ నాయకులు తాళ్ల భాస్కర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, బుచ్చిబాబు, కర్రె శ్యామ్, విజయ్, శ్రీశైలం, శ్రీకాంత్, నరేష్ తదితరులు ఉన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
10 నవంబర్
2025





# బీఆర్ఎస్ వ్యాలిడిటీ అయిపోయింది

**జూబ్లీహిల్స్ ఓటర్లకు కేసీఆర్ ఎందుకు విజ్ఞప్తి చేయలేదు?**
**దీన్ని బట్టి కేటీఆర్, హరీశ్‌పై ఆయన ఆలోచనను అర్థం చేసుకోవచ్చు**
**ధృతరాష్ట్రుడిలా దుర్మార్గాల్ని భరిస్తున్నరు**
**పార్టీ కూలుతుంటే కుమిలిపోతున్నరు**
**ఈసారి ఎన్నికలు 2029 జూన్‌లో..**
**2034 వరకూ కాంగ్రెస్సే అధికారంలో..**
**రానున్న పదేళ్లలో వందేళ్ల అభివృద్ధి చేసి చూపిస్తాం**
**కేసీఆర్ పెట్టిన ఏ పథకాన్నీ ఆపలే**
**గుజరాత్‌కు గులాముగా కిషన్‌రెడ్డి**
**కేటీఆర్‌తో చెడు సావాసాన్ని ఆపాలి**
**సెంటిమెంటా? డెవల్‌పమెంటా?**
**జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించుకోవాలి**
**కాలేజీలు నిబంధనల ప్రకారం పోదామంటే మేం సిద్ధం**
**'మీట్ ద ప్రెస్'లో సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, నవంబరు 9 :** బీఆర్ఎస్ కాలగర్భంలో కలిసిపోతున్న పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ వ్యాలిడిటీ పీరియడ్ అయిపోయిందన్నారు. ఇదేమీ తాను రాజకీయ విమర్శ కోసం చెబుతున్నది కాదని, ఒకప్పుడు తెలంగాణలో బలంగా ఉన్న టీడీపీ ఇప్పుడు ఇక్కడ లేకుండా పోయిందని గుర్తు చేశారు. కేసీఆర్‌తోనే ఆ పార్టీ పని అయిపోతుందన్నారు. కేసీఆర్‌కు గతమే తప్ప.. భవిష్యత్తు లేదని, ఆ బాధతోనే ఆయన బయటికి రావడంలేదని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థికి ఓటేయాలని నియోజకవర్గ ప్రజలకు ఈనాటి వరకూ కేసీఆర్ విజ్ఞప్తి చేయకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. "బయటికి వచ్చి ప్రచారం చేయడానికి ఆరోగ్య సమస్యలు ఉండవచ్చు. కానీ, పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కూడా విజ్ఞప్తి చేయడంలేదంటే కేటీఆర్, హరీశ్‌రావుపై ఆయనకున్న ఆలోచనేంటో అర్థం చేసుకోవచ్చు" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన కళ్లముందు పార్టీ కూలిపోతుంటే కుమిలిపోతున్నారని, దుఃఖం, ఆవేదనతో కాలక్షేపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను ప్రత్యర్థిగా కాకుండా సానుభూతితో చూడాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ద ప్రెస్' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆత్మహత్య చేసుకుని మరీ బీజేపీకి అవయవదానం చేసిందని ఆరోపించారు. దాంతో బీజేపీ గెలుచుకున్న 8 సీట్లే మోదీ మూడోసారి ప్రధాని కావడానికి ఉపయోగపడ్డాయన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రక్రియ మొదలైందంటూ కేసీఆర్ కూతురు కవితే స్వయంగా చెప్పారని గుర్తు చేశారు.

**సీబీఐ కాళ్లకు బంధం వేసిందెవరు?**

కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడిచినా ఇంతవరకు విచారణ ప్రారంభం కాలేదని, సీబీఐ కాళ్లకు బంధం వేస్తున్నది ఎవరని ప్రశ్నించారు. అలాగే ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్ అరెస్టుకూ గవర్నర్ నుంచి అనుమతి రాలేదన్నారు. సొంత చెల్లిని, మాగంటి తల్లిని కేటీఆర్ అవమానించారని ఆరోపించారు. మహిళలకు రక్షణ కల్పించలేని కేటీఆర్.. ప్రజల అభిమానం ఎలా చూరగొంటారని ప్రశ్నించారు. కేసీఆర్ ధృతరాష్ట్రుడిలాగా పిల్లల దుర్మార్గాలను భరిస్తున్నారని వ్యాఖ్యానించారు. తనది కార్యకర్త మనస్తత్వమని, హుజూరాబాద్, హుజూర్‌నగర్, సాగర్, మునుగోడు ఉప ఎన్నికల్లోనూ జూబ్లీహిల్స్ కంటే ఎక్కువగా ప్రచారం చేశానని తెలిపారు. 2034 జూన్ వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, దీనిని రాసిపెట్టుకోవచ్చని ప్రకటించారు. రాబోయేవి జమిలి ఎన్నికలు అని, 2028 డిసెంబరుకు బదులుగా.. 2029 జూన్‌లో జరుగుతాయని అన్నారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే విజయం సాధించి 2034 జూన్ వరకూ అధికారంలో కొనసాగుతుందని జోస్యం చెప్పారు. ఈ పదేళ్లలో.. వందేళ్ల అభివృద్ధి చేస్తామన్నారు.

**చరిత్ర కేసీఆర్ చెరిపేస్తే చెరగదు..**

2004 నుంచి 2014 వరకు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. రైతుల సంక్షేమం కోసం కృషి చేసిందని సీఎం రేవంత్ తెలిపారు. హైదరాబాద్ నగరానికి గోదావరి నీళ్లు రావడానికి సీఎల్పీ నేతగా పీజేఆర్ నడిపిన పోరాటమే కారణమన్నారు. ఐటీ, ఫార్మా, నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్ మారిందంటే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రత్యేక పాలసీల వల్లనేనని పేర్కొన్నారు. జంటనగరాలకు నిరంతర విద్యుత్తు ఇవ్వాలని విధాన పరమైన నిర్ణయం తీసుకోవడంతో దిగ్గజ ఐటీ సంస్థలు తరలి వచ్చాయన్నారు. దేశానికి సరఫరా అవుతున్న బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం హైదరాబాద్‌లో ఉత్పత్తి అవుతున్నవేనని చెప్పారు. పదేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ప్రణాళికలు, విధానపరమైన నిర్ణయాల కారణంగా వచ్చిన ప్రపంచ దిగ్గజ సంస్థలు.. హైదరాబాద్‌కు గ్రోత్ ఇంజన్లుగా మారాయన్నారు. తెలంగాణలో 65 శాతం ఆదాయం హైదరాబాద్ నగరం నుంచే వస్తోందని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ కార్యక్రమాలను తీసుకువచ్చి అభివృద్ధి, సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాలెన్స్ చేసిందన్నారు. ఈ చరిత్ర కేసీఆర్ చెరిపేస్తే చెరిగేది కాదన్నారు. ఆనాటి పదేళ్ల కాంగ్రెస్ పాలన, ఆ తర్వాత కేసీఆర్ పదేళ్ల పాలనతో పోల్చి చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**గుజరాత్‌కు గులాం.. కిషన్‌రెడ్డి!**

సబర్మతీ, గంగా, యమునా రివర్ ఫ్రంట్‌లను అద్భుతమంటూ ఓవైపు బీజేపీ ప్రచారం చేసుకుంటుంటే.. మూసీ రివర్ ఫ్రంట్‌ను మాత్రం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. ఇక్కడి పెట్టుబడులు గుజరాత్‌కు తరలి పోవాలన్నదే కిషన్‌రెడ్డి ప్రణాళిక అని, ఆయన గుజరాత్‌కు గులాంగిరీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణకు వచ్చిన సెమీకండక్టర్లు, పెట్టుబడులను ప్రధాని కార్యాలయం నుంచే బెదిరించి గుజరాత్‌కు పట్టుకుపోతే కిషన్‌రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నా రు. ఆయన తనపై ఒంటి కాలిమీద లేస్తే ఏమొస్తుందని, చేతనైతే ప్రధాని మోదీ వద్దకు వెళ్లి నిలదీయాలని అన్నారు. లేదంటే మోదీ కాళు పట్టుకుని కొన్ని ప్రాజెక్టులను తెలంగాణకు వదిలేయాలంటూ కోరాలన్నారు. కేటీఆర్‌తో చెడు సావాసాన్ని కిషన్‌రెడ్డి వదులుకోవాలని సూచించారు. బ్యాడ్ బ్రదర్స్ కేటీఆర్, కిషన్‌రెడ్డి అడ్డుకోని అంశాల్లో కేంద్రం ప్రభుత్వం తన వంతు సహకారం అందిస్తోందని ఒక ప్రశ్నకు సమాధానంగా సీఎం చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి, బీజేపీ డిపాజిట్లు జప్తు కావడం ఖాయమన్నారు. బీఆర్ఎసను వ్యతిరేకించే ఏ ఎంపీనీ కిషన్‌రెడ్డి ప్రచారానికి రానివ్వడంలేదని ఆరోపించారు.

**కేసీఆర్ ప్రారంభించిన ఏ పథకాన్నీ ఆపలేదు..**

బీఆర్ఎస్ హయాంలో కొత్తగా ఒక్క యూనివర్సిటీ కూడా తేలేదని, కనీసం వీసీలను కూడా నియమించలేదని సీఎం రేవంత్ విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 వేలకు పైగా స్కూళ్లను మూసేశారని, రైతులకు వ్యవసాయాన్ని, మహిళలకు రాజ్యాధికారాన్ని దూరం చేశారని ఆరోపించారు. కొత్తగా ఆస్పత్రులనూ నిర్మించలేదన్నారు. కేసీఆర్ హయాంలో నగరంలో చేపట్టిన ఏ ఒక్క ప్రాజెక్టయినా పూర్తయిందా? అని ప్రశ్నించారు. తన రెండేళ్ల ప్రజా ప్రభుత్వంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండా ఆర్టీసీని లాభాల బాట పట్టించామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, రూ.3 వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రిని, వందెకరాల్లో హైకోర్టునూ నిర్మిస్తున్నామన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా సన్నబియ్యం ఇస్తున్నామని, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ.21 వేల కోట్ల రుణమాఫీ అమలు చేశామన్నారు. కేసీఆర్ ప్రారంభించిన ఏ ఒక్క పథకాన్నీ ఆపకుండా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, కులగణన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. ఏడాదిన్నరలో రాష్ట్రానికి 3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్ నగరానికి 20 టీఎంసీల గోదావరి జలాలు తెచ్చేందుకు ప్రణాళికలు తయారు చేశామని, వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బెస్ట్ ఫైనాన్షియల్ పాలసీని తీసుకువస్తామని ప్రకటించారు.

**కాలేజీలు రూల్ ప్రకారం పోదామంటే సిద్ధం: సీఎం రేవంత్**

కాలేజీల నిర్వహణలో నిక్కచ్చిగా రూల్ ప్రకారం పోదామంటే తాను వంద శాతం సిద్ధంగా ఉన్నానని యాజమాన్యాలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. యాజమాన్యాలు రూపాయి కూడా డొనేషన్ తీసుకోవద్దని, మెరిట్ లేకుండా సీట్లు ఇవ్వవద్దని అన్నారు. విజిలెన్స్ డిపార్ట్‌మెంట్, కాలేజీ మేనేజ్‌మెంట్‌లతో నిజనిర్ధారణ కమిటీ వేసి ఒక్కో కాలేజీని పరిశీలించి ప్రక్షాళన చేద్దామన్నారు. ఆయా కాలేజీల్లో నిబంధనల ప్రకారం బోధనా సిబ్బంది, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్నాయా, లేదా అని పరిశీలిద్దామన్నారు. కొన్ని కాలేజీలైతే ఆయా కాలేజీల నుంచి వెళ్లిపోయిన విద్యార్థుల పేరుమీద కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ వసూలు చేయడం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అర్బన్ ఇంజనీరింగ్ కాలేజీ అయితే కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సులకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు డొనేషన్లు వసూలు చేస్తున్నారని, మెడికల్ కాలేజీల్లోనైతే ఇంకా ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఆయా సీట్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం రూ.35 వేల చొప్పున మాత్రమేనన్నారు. "డొనేషన్లు లేని డిగ్రీ కాలేజీలకు మొదట చెల్లించి.. డొనేషన్లు తీసుకుంటున్న ఇంజనీరింగ్ కాలేజీలకు విడతల వారీగా చెల్లిస్తామంటే.. 'లేదు ఒకేసారి కట్టాలి.. లేకుంటే బంద్ పెడతాం' అంటున్నారు. కాలేజీలు బంద్ పెట్టినా ఆరు నెలల తర్వాత వారి ఫీజు రీయింబర్స్‌మెంట్ వారికి వస్తుంది. విద్యాసంవత్సరం కోల్పోయిన విద్యార్థికి ఎవరు జవాబుదారీ? విద్యను రాజ్యాంగం సేవగానే గుర్తించింది కానీ.. వ్యాపారంగా కాదు. కాలేజీలు బంద్ పెట్టడం వల్ల సమస్యకు పరిష్కారం దొరకదు. పిల్లల కోణంలో ఈ సమస్యను చూడాలి" అని సీఎం రేవంత్ అన్నారు.

# నన్ను అవమానకరంగా బయటికి పంపారు

**'మీట్ ద ప్రెస్'లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**



**వరంగల్, నవంబరు 9 :** అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. అలా శాశ్వతం అనుకున్నవాళ్లను ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తాను ఉద్యమ సమయంలో బతుకమ్మ సంబరాల పేరుతో ప్రతీ పల్లె తిరిగానని, కానీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రొటోకాల్ పేరుతో తనను నిజామాబాద్‌కే కట్టడి చేశారని ఆరోపించారు. తనను అకారణంగా బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశారని చెప్పారు. ఆదివారం వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో కవిత మాట్లాడారు. "బీఆర్ఎసలో నేను మంత్రిని కాదు. నా సంతకంతో పనులయ్యే పరిస్థితి లేదు. అయినా నా వద్దకు వచ్చిన వారికి శక్తిని మించి పనులు చేశాను. ఎన్నో సమస్యలు కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాను అయినా ఫలితం లేకుండేది. బీఆర్ఎసలో నాకు ఎవరితోనూ పంచాయితీ లేదు. అయినా కుటుంబం నుంచి నన్ను బయటికి పంపించారు. 20ఏళ్లు బీఆర్ఎసలో పనిచేస్తే.. షోకాజ్ నోటీస్ కూడా ఇవ్వకుండా అవమానకరంగా సస్పెండ్ చేశారు. నేనూ తెలంగాణ బిడ్డనే.. ఆకలినైనా తట్టుకుంటా.. అవమానాన్ని మాత్రం తట్టుకోను. ఇప్పుడు నాకు రాజకీయంగా బీఆర్ఎసతో ఎలాంటి సంబంధం లేదు. కేసీఆర్ వద్దకు కూతురిగా వెళ్తా. రాజకీయంగా వెళ్లే పరిస్థితి లేదు" అని కవిత తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశాక ప్రజల కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నానని.. ఇప్పుడే రాజకీయం చేయాలనుకోవటం లేదన్నారు. అయితే రాజకీయం చేయడం పక్కా అని.. ఆడబిడ్డలు రాజకీయంచేస్తే ఎలా ఉంటుందో చూపిస్తానని చెప్పారు. ఎన్నికలకు ఏడాది ముందు తన రాజకీయాలు ఉంటాయని, అప్పటివరకు ప్రజాసమస్యలపైనే పోరాటమని పేర్కొన్నారు.

**హరీశ్‌రావు బినామీ కంపెనీకి..**

గత ప్రభుత్వం వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను రూ.1,100కోట్ల అంచనా వ్యయంతో ఓ కంపెనీకి అప్పగించిందని, ఆ బినామీ కంపెనీ అంచనా వ్యయాన్ని రూ.1,700 కోట్లకు పెంచేలా చేసుకుందని కవిత ఆరోపించారు. ఆ బినామీ కంపెనీ హరీశ్‌రావుదేనని అం టున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టినా చర్యలు చేపట్టడం లేదేమని ప్రశ్నించారు. మేడారం టెండర్ల విషయం లో ఇద్దరు మంత్రుల పంచాయితీని ప్రజలు వినోదంగా చూశారన్నారు. రిజర్వేషన్లతోనే అవకాశాలు అని కాకుండా అందరికీ సమానంగా అవకాశాలు రావాలని కవిత ఆకాంక్షించారు. రాజకీయ నేపథ్యంలేని మహిళలకు రాజకీయ అవకాశాలు రావాలన్నారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, అప్పుడే కొత్త నాయకత్వం వస్తుందని తెలిపారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అవే సమస్యలు..**

ఏ సమస్యలను లేవనెత్తి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందో.. ఆ సమస్యలు రెండేళ్లయినా అలాగే ఉన్నాయని కవిత విమర్శించారు. ఇద్దరు మహిళా మంత్రులు ఉన్నా కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించకపోవటం సిగ్గుచేటన్నారు. మెగా డీఎస్సీ వేయాలని, ఎటువంటి లోపాలు లేకుండా గ్రూప్స్ పరీక్షలు నిర్వహించాలని సీఎం డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల మృతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని.. గత ప్రభుత్వమిచ్చిన 60వేల ఉద్యోగాలను తన ఖాతాలో వేసుకుంటోందని విమర్శించారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పైసా సాయం చేయలేదని కవిత మండిపడ్డారు. ధాన్యం కొనుగోలుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.



# జూబ్లీహిల్స్ తీర్పుతో రేవంత్ పీఠం కదలాలి

**గోస పడుతున్న తెలంగాణ మీ దిక్కు చూస్తోంది**
**యూసుఫగూడ రోడ్ షోలో కేటీఆర్**

**హైదరాబాద్ :** 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల తీర్పుతో సీఎం రేవంత్‌రెడ్డి పీఠం కదలాలి. నల్లగొండ, ఖమ్మం జిల్లాల మంత్రులు సీఎం కుర్చీ కోసం ఢిల్లీలో రేవంత్‌పై కత్తులు నూరుతున్నరు. మీరిచ్చే షాక్‌తో మూడేళ్లు కాదు.. మూడు నెలలు కూడా ఆయన పదవిలో ఉండే పరిస్థితి ఉండదు' అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసే ఓటుకు రూ.4 వేల నుంచి రూ.6 వేలు పంచాలని కాంగ్రెస్ నేతలను సీఎం రేవంత్‌రెడ్డి పంపారని, వాటిలోనూ ఆ పార్టీ నేతలు కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చే డబ్బులు తీసుకొని.. కారు గుర్తుకు ఓటేయ్యాలని ఓటర్లను కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ఆదివారం యూసు ఫ్‌గూడలో నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ హామీలైన ఆరు గ్యారంటీలు, తులం బంగారం, ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, రూ.4 వేల పెన్షన్ ఇచ్చారా..? అని ప్రశ్నించారు. రెండేళ్లలో ఒక్క మాట కూడా నిలబెట్టుకోలేకపోయిన సీఎం.. జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేస్తానంటే ఎలా నమ్ముతారని నిలదీశారు. శని, ఆదివారం వచ్చిందంటే పేదల ఇళ్లపైకి బుల్డోజర్ వస్తుందని, ఇందిరమ్మ రాజ్యమంటూ వేల ఇళ్లను నేలమట్టం చేశారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో సునీతమ్మను గెలిపిస్తే హైడ్రా బుల్డోజర్‌కు అడ్డుగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలై, పేదలు కష్టపడి కొనుక్కున్న ప్లాట్ల ధరలు అమాంతం పడిపోయి, వారి పెట్టుబడి హారతి కర్పూరంలా కరిగిపోయే దుస్థితి నెలకొందన్నారు. 'జూబ్లీహిల్స్ ఓటర్లు కాంగ్రెసను ఓడిస్తే.. అన్ని హామీలు అమలవుతాయి. గోస పడుతున్న రాష్ట్ర ప్రజలంతా ఇప్పుడు మీ దిక్కు చూస్తున్నారు' అని అన్నారు.

**ఇప్పుడే బెదిరిస్తున్నారు.. గెలిస్తే బతకనిస్తరా?**

ఓటు వేయకుంటే సంగతి చూస్తామని కొందరు ఆకు రౌడీలు బెదిరిస్తున్నారని, ఇప్పుడే ఇలా ఉంటే వాళ్లు గెలిస్తే బతకనిస్తరా..? అని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వ్యాపారులు, సామాన్య ప్రజానీకం ఆలోచించాలని కోరారు. నేర చరిత్ర ఉన్న వాళ్లకు ఓటు వేయాలా.. వద్దా..? అన్నది మీరే తేల్చుకోవాలన్నారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ కాంగ్రెసకు మద్దతుగా ఎందుకు ప్రచారం చేస్తున్నారో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు.

# కేటీఆర్.. ప్రమాణం చెయ్



**హైదరాబాద్ :** "కేటీఆర్.. ఎన్నడూ డ్రగ్స్ తీసుకోలేదని, తీసుకోనని కుటుంబ సమేతంగా భాగ్యలక్ష్మి అమ్మవారి వద్ద తడిబట్టలతో ప్రమాణం చేసే దమ్ముందా? సోమవారం ఉదయంలోపు ప్రమాణం చెయ్" అని కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన పాదయాత్ర చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "అయ్య పేరు చెప్పి గెలిచిన బతుకు కేటీఆర్‌ది.. కేసీఆర్ లేకుంటే ఆయనను కుక్కలు కూడా చూడవు" అని మండిపడ్డారు. విర్రవీగిన కేసీఆర్ మెడలు వంచింది బీజేపీయేనని, కాంగ్రెస్ మెడలు వంచి అధికారంలో నుండి దింపేది కూడా బీజేపీయేనని ఆయన వ్యాఖ్యానించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి డబ్బులు పంచుతున్నాయని.. కాంగ్రెస్ రూ.7 వేలు ఇస్తే, బీఆర్ఎస్ రూ.5 వేలు పంచుతోందని ఆరోపించారు. "డబ్బులు తీసుకోండి... పువ్వు గుర్తుకు ఓటేసి కాంగ్రెస్, బీఆర్ఎసలకు బుద్ధి చెప్పండి" అని పిలుపునిచ్చారు. హిందువుల ఓట్లు అవసరం లేదన్నట్లుగా ముఖ్యమంత్రే మాట్లాడుతున్నారంటే ఏమనాలని ప్రశ్నించారు. బీజేపీ 80 శాతం మంది హిందువుల పక్షాన పోరాడుతోందని గుర్తుచేశారు. మాగంటి గోపీనాథ్ జూన్ 8న చనిపోతే.. ఆయన తల్లి అదే నెల 25న పోలీసులకు ఫిర్యాదు చేశారని.. అయినా ఇప్పటిదాకా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గోపీనాథ్ కుమారుణ్ని ఇండియాకు రావొద్దంటూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బెదిరించారని దుయ్యబట్టారు. మాగంటి సునీతకు రెండు ఓటర్ కార్డులున్నాయని.. ఒక ఓటర్ కార్డులో సునీత భర్త పేరు సునీత మనోహర్ అని ఉందని.. ఇంకో ఓటర్ కార్డులో సునీత భర్త పేరు మాగంటి గోపీనాథ్ అని ఉందని ఆరోపించారు. ఆ ఓటర్ కార్డులను తాను ప్రభుత్వానికి పంపిస్తున్నానని.. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 2023 ఎన్నికల అఫిడవిట్‌లో మాగంటి సునీత తాను చదువుకోలేదని రాసిచ్చారని, 2025 ఎన్నికల అఫిడవిట్‌లో పదోతరగతి వరకు చదువుకున్నారని రాసిచ్చారని.. దీనిపైనా విచారణ జరపాలని డిమాండ్‌చేశారు. గోపీనాథ్ ఆస్తులను కాజేసేందుకు సునీతతో కలిసి కేటీఆర్ కుట్ర చేస్తున్నారని.. ఆ ఆధారాలను, తన దగ్గరున్న సమాచారాన్ని పోలీసులకు పంపించానని తెలిపారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
10 నవంబర్
2025





# మళ్లీ అణు సైరన్!

**ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి తరహాలో మళ్లీ అణ్వాయుధాల పోటీ**
**ఉక్రెయిన్ వేదికగా అగ్ర రాజ్యాల పోరు**
**అణుశక్తితో నడిచే క్షిపణి, టార్పెడోలను విజయవంతంగా పరీక్షించిన రష్యా**
**అణు పరీక్షలను పునః ప్రారంభిస్తున్నట్టు ట్రంప్ ప్రకటన.. అణ్వస్త్రాల పెంపులో చైనా**



మన ప్రపంచం మళ్లీ 'అణు'భయంలోకి వెళుతోంది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన మూడు దశాబ్దాల తర్వాత తిరిగి అణ్వాయుధ పోటీ మొదలవుతోంది. ఒకప్పుడు అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధంతో ప్రపంచమంతా వణికిపోతే.. ఇప్పుడు ఉక్రెయిన్‌లో యుద్ధ పరిణామాలతో అమెరికా, రష్యా మధ్య ఉప్పూనిప్పుగా మారిన పరిస్థితి కలకలం రేపుతోంది. అణుశక్తితో నడుస్తూ, అణ్వస్త్రాలను ప్రయోగించే సామర్థ్యమున్న అత్యాధునిక క్షిపణి, టార్పెడోలను విజయవంతంగా పరీక్షించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల వెల్లడించగా.. తాము అణు పరీక్షలను పునః ప్రారంభిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అక్టోబరు 22న రష్యా అణ్వస్త్ర ప్రయోగానికి సంబంధించి డ్రిల్స్ కూడా నిర్వహించింది.

**'స్టార్‌వార్స్' నుంచి నేటి 'పొసైడాన్' వరకు..**

రెండో ప్రపంచ యుద్ధం అనంతరం అమెరికా అగ్రరాజ్యంగా అవతరించింది. జపాన్‌పై చేసిన అణుదాడితో ప్రపంచంలోనే శక్తివంతమైన దేశం అమెరికానే అనే అభిప్రాయం కలిగించింది. అమెరికాకు దీటుగా నిలిచేందుకు నాటి సోవియట్ యూనియన్ పెద్ద ఎత్తున అణ్వాయుధాలు, క్షిపణులను తయారు చేసింది. ఈ క్రమంలో సోవియట్ యూనియన్ నుంచి రక్షణ కోసమని 1983లో నాటి అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ 'స్ట్రాటజిక్ డిఫెన్స్ ఇనిషియేటివ్ (ఎస్‌డీఐ)'ను ప్రకటించారు. భూమితోపాటు అంతరిక్షంలోనూ రాడార్లు, క్షిపణులు, లేజర్ ఆయుధాలను మోహరిస్తామని ప్రకటించారు. ఈ ఎస్‌డీఐనే 'స్టార్‌వార్స్'గా కూడా పిలుస్తారు. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమవడంతో అమెరికా దూకుడు తగ్గించుకుంది. కానీ సోవియట్‌లో భాగమైన రష్యా పోటీగా నిలవడంతో మళ్లీ ఆయుధాల రేసు మొదలైంది. ఈ క్రమంలో 10 వేల కిలోమీటర్లకుపైగా దూరంలోని లక్ష్యాలను ఛేదించగల బాలిస్టిక్ క్షిపణి మినట్ మ్యాన్-3, జలాంతర్గాముల నుంచి ప్రయోగించగల ట్రైడెంట్-2 డీ5 బాలిస్టిక్ క్షిపణుల (7,300 కి.మీ. పరిధి)ను, బీ-2 వంటి అత్యాధునిక, స్టెల్త్, భారీ బాంబర్లను అమెరికా అభివృద్ధి చేసింది.

మరోవైపు రష్యా కూడా 18వేల కిలోమీటర్ల పరిధి ఉన్న ఆర్ఎస్-28 సర్మత్ వంటి క్షిపణులను, క్షిపణుల నుంచి విడివడి గంటకు 24 వేల కిలోమీటర్ల వేగంతో లక్ష్యంపై దాడి చేయగల అవన్‌గార్డ్ వంటి గ్లైడ్ ఆయుధాలను అభివృద్ధి చేసింది. తాజాగా అణుశక్తితో నడిచే, అణ్వాయుధ సామర్థ్యమున్న బురెవెస్ట్‌నిక్ క్రూయిజ్ క్షిపణి, పొసైడాన్ టార్పెడోలను విజయవంతంగా పరీక్షించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. బురెవెస్ట్‌నిక్ క్షిపణి అణుశక్తితో దూసుకెళ్తుంది కాబట్టి.. దానికి గరిష్ఠ పరిమితి ఏమీ లేదని, ప్రయోగ సమయంలో 15 గంటల్లో 14 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించిందని రష్యా తెలిపింది. ఇక జలాంతర్గామి నుంచి ప్రయోగించే పొసైడాన్ టార్పెడో కూడా సముద్రంలో అడుగున ప్రయాణిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్లి విధ్వంసం సృష్టించగలదని చెబుతున్నారు.

**'అణు'తెరపై చైనా దూకుడు**

ప్రపంచంలో ఆర్థిక పరంగా రెండో అతిపెద్ద దేశంగా ఎదిగిన చైనా కూడా అగ్రరాజ్యం అనిపించుకోవడానికి 'అణు'మార్గం పట్టింది. కొన్నేళ్లుగా అణ్వస్త్రాల తయారీ వేగాన్ని పెంచింది. సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ నివేదిక ప్రకారం.. 2020లో చైనా వద్ద 300 అణ్వస్త్రాలు ఉండగా, ప్రస్తుతం 600కు చేరాయి. 2030 నాటికి ఈ సంఖ్య 1000 దాటుతుందని అంచనా. కానీ చైనా భారీ స్థాయిలో అణ్వాయుధాలను ఉత్పత్తి చేస్తోందని.. వచ్చే ఐదారేళ్లలో అమెరికా, రష్యాలతో సమానంగా చైనా వద్ద అణ్వస్త్రాలు ఉంటాయని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

**అణు పరీక్షలకు సిద్ధమవుతున్న పాక్?**

పాకిస్థాన్ తమ సింధ్ ప్రాంతంలోని పర్వత ప్రాంతాల్లో రహస్యంగా సొరంగాల నిర్మాణం చేపట్టింది. అది అణు పరీక్షల కోసమేనని సింధు ప్రాంతంలోని పౌర సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై ఐక్యరాజ్యసమితికి, అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ (ఐఏఈఏ)లకు తాజాగా ఫిర్యాదు చేశాయి. పాకిస్థాన్ రహస్యంగా అణు పరీక్షలు నిర్వహిస్తోందని ఇటీవల ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

**ప్రపంచంపై ఆధిపత్యం కోసం..**

ప్రపంచంలో తొలిసారిగా అమెరికా అణ్వాయుధాల తయారీ కోసం 1942లో మాన్‌హట్టన్ ప్రాజెక్టును చేపట్టింది. 1945లో జూలైలో ట్రినిటీ పేరిట తొలి అణు పరీక్ష నిర్వహించింది. అదే ఏడాది ఆగస్టులో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై వేసిన అణు బాంబులు ప్రపంచ గతినే మార్చేశాయి. అగ్ర రాజ్యాల మధ్య అణ్వాయుధ పోటీ మొదలైంది. 1949 ఆగస్టులో సోవియట్ యూనియన్ 'ఫస్ట్ లైట్నింగ్' పేరిట తొలి అణుపరీక్ష నిర్వహించింది. ప్రపంచం రెండు ధ్రువాలుగా మారిపోయింది. ఈ క్రమంలో 1962లో ప్రపంచం ఒకసారి అణుయుద్ధం అంచుల వరకు వెళ్లింది. అమెరికాకు సమీపంలో ఉన్న కమ్యూనిస్టు దేశం క్యూబాలో సోవియట్ యూనియన్ క్షిపణులు మోహరించిన విషయం తెలిసి అమెరికా అగ్గిమీద గుగ్గిలమైంది. ఇరుదేశాల యుద్ధ నౌకలు, విమానాల మోహరింపుతో అణు యుద్ధం మొదలైనట్టేనన్న పరిస్థితి నెలకొంది. కానీ ప్రపంచ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో అమెరికా, సోవియట్ వెనక్కి తగ్గాయి. 1963లో కొత్త అణుపరీక్షల నిషేధంపై మధ్యంతర ఒప్పందం కుదుర్చుకున్నాయి. కానీ అణ్వాయుధాల తయారీ కొనసాగింది. కొత్తగా అణ్వాయుధాలు, బాలిస్టిక్ క్షిపణులు తయారు చేయకుండా 1972లో సాల్ట్-1 (వ్యూహాత్మక ఆయుధాల నియంత్రణ ఒప్పందం) చేసుకున్నాయి. తర్వాత 1979లో సాల్ట్-2 ఒప్పందం కుదుర్చుకున్నాయి. తమ అణ్వాయుధాల సంఖ్యను, ఒకే సమయంలో ఎక్కువ సంఖ్యలో లక్ష్యాలను ఛేదించగల క్షిపణుల (ఎంఐఆర్‌వీ) సంఖ్యను తగ్గించుకోవడానికి అంగీకరించాయి. కొన్నేళ్లు అంతా బాగానే ఉన్నా.. అఫ్గానిస్థాన్‌ను సోవియట్ ఆక్రమించుకోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

## క్షిపణులు, సబ్‌మెరైన్ల సామర్థ్యం ఎంత?

రష్యా..

అణ్వస్త్రాలను ప్రయోగించగల ఖండాంతర్గత బాలిస్టిక్ క్షిపణులు రష్యా వద్ద 1,950 వరకు ఉన్నట్టు అంచనా. అందులో నేల మీది నుంచి ప్రయోగించే.. ఆర్ఎస్-28 సర్మత్-18,000 కి.మీ, ఆర్-36ఎం - 16,000 కి.మీ, ఆర్ఎస్-24 యార్స్ - 12,000 కి.మీ దూరంలోని లక్ష్యాలను ఛేదించగలవు. జలాంతర్గాముల నుంచి ప్రయోగించే ఆర్-29 ఆర్ఎంయూ2 సినేవా - 11,500 కి.మీ, ఆర్ఎస్ ఎం-56 బులవా - 9,000 కి.మీ. సామర్థ్యం ఉన్నవి. ఇవన్నీ ఇప్పటికే వినియోగంలో ఉన్నవి. ఇటీవల పరీక్షలు చేసిన అణుచోదిత క్షిపణి, అణుచోదిత పొసైడాన్ టార్పెడోలు వీటికి అదనం. ఇక రష్యా వద్ద మొత్తం 79 జలాంతర్గాములు ఉన్నాయి. అందులో 16 అణుశక్తితో నడిచేవి. నీటి అడుగునే ఉండి ఖండాంతర్గత బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించే సామర్థ్యం వాటి సొంతం.

**యూఎసఏ**

అమెరికా వద్ద అణ్వస్త్రాలను ప్రయోగించగల ఖండాంతర్గత బాలిస్టిక్ క్షిపణులు 1,200 వరకు ఉన్నట్టు అంచనా. అందులో నేలమీద నుంచి ప్రయోగించే.. మినట్‌మ్యాన్-3, సెంటినల్ క్షిపణుల పరిధి 13 వేల కి.మీ వరకు ఉంటే.. జలాంతర్గాముల నుంచి ప్రయోగించే ట్రైడెంట్-2డీ5 పరిధి 12 వేల కి.మీ. ఇక అమెరికా వద్ద మొత్తం 68 జలాంతర్గాములు ఉన్నాయి. అందులో 14 అణుశక్తితో నడిచేవి. నీటి అడుగునే ఉండి ఖండాంతర్గత బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించే సామర్థ్యం వాటి సొంతం. యూఎస్ వద్ద ఉన్నవాటిలో ఒహియో, కొలంబియా క్లాస్ సబ్‌మైరెన్లు ముఖ్యమైనవి.

# ఓట్ల చోరీని అడ్డుకుంటే.. బిహార్‌లో విజయం మాదే!

**దేశాన్ని విభజించడానికి యత్నిస్తున్న బీజేపీ, ఆరెస్సెస్: రాహుల్**
**మోదీ, షా ఎక్కడికెళ్లినా 'ఓట్ల చోరీ'పై దొరికిపోతారని వ్యాఖ్య**
**సాత్పురా టైగర్ రిజర్వులో రాహుల్ సఫారీ.. బీజేపీ విమర్శలు**
**శిక్షణ శిబిరానికి ఆలస్యంగా రాహుల్.. శిక్షగా పది బస్కీలు**




**కిషన్‌గంజ్, నవంబరు 9:** ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్కడికెళ్లినా కూడా ఓట్ల చోరీ విషయంలో దొరికిపోతారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఓట్ల చోరీని అడ్డుకుంటే బిహార్‌లో నూటికి నూరు శాతం ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన కిషన్‌గంజ్, పూర్ణియా సభల్లో మాట్లాడారు. దేశాన్ని విభజించడానికి బీజేపీ, ఆరెస్సెస్ ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అయితే ఇండియా కూటమి మాత్రం దేశాన్ని ఏకం చేయడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. ఓటు చోరీపై తాము చేసిన ఆరోపణలకు మోదీ, షా, ఈసీ వద్ద ఎలాంటి సమాధానం లేదని, ఇప్పుడు వాస్తవాలన్నీ ప్రజల ముందుకు వచ్చాయని అన్నారు. హరియాణాలో పెద్దఎత్తున ఓట్ల చోరీ జరిగిందని ఇటీవల తాను బయటపెట్టానని గుర్తుచేశారు. దీనిపై మోదీ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ స్పందించలేదని, రాహుల్ అబద్ధాలాడుతున్నాడని చెప్పే ధైర్యం వారు చేయలేదన్నారు. ఓటింగ్ రోజున (నవంబరు 11న) పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండి ఓట్ల చోరీని అడ్డుకోవాలని యువత, కార్మికులు, రైతులకు ఆయన పిలుపునిచ్చారు. చేపలు, మఖనా సమృద్ధిగా లభించే రాష్ట్రంలో 20ఏళ్లలో ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారో నితీశ్ కుమార్ సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు.

**ఓటు చోరీని కప్పిపుచ్చే యత్నం.. 'సర్'**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎసఐఆర్) అనేది ఓట్ల చోరీని కప్పిపుచ్చడానికి, వ్యవస్థను సంస్థాగతీకరించడానికి చేస్తున్న ప్రయత్నమని రాహుల్ గాంధీ ఆరోపించారు. మధ్యప్రదేశ్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో పాల్గొనడానికి ఆయన ఆదివారం నర్మదాపురంలోని పంచ్‌మర్హికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హరియాణాలో 25 లక్షల ఓట్లను చోరీ చేశారని, ఇదే తరహాలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీసగఢ్‌ల్లోనూ జరిగి ఉంటుందని భావిస్తున్నామని చెప్పారు. దీనిపై తమవద్ద మరిన్ని ఆధారాలతో పాటు వివరణాత్మక సమాచారం ఉందని, దాన్ని కూడా త్వరలోనే బయటపెడతామని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ చూపించింది చాలా స్వల్పమేనని చెప్పారు. అనంతరం సాత్పురా టైగర్ రిజర్వ్‌లోని పనార్పణిలో రాహుల్ జంగిల్ సఫారీకి వెళ్లారు. దీనిపై బీజేపీ ఘాటుగా స్పందించింది. బిహార్ ఎన్నికల ఫలితం ఎలా ఉంటుందో రాహుల్‌కు ముందే అర్థమైపోయిందని, అందుకే సెలవు తీసుకొని మరీ జంగిల్ సఫారీని ఆస్వాదిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా 'ఎక్స్'లో చేసిన పోస్టులో ఎద్దేవా చేశారు. దీన్నిబట్టి ఆయన ప్రాధాన్యతలు ఏమిటో తెలుస్తున్నాయన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత మాత్రం ఈసీఐపై నిందలు వేస్తూ హెచ్(హాలిడే) ఫైల్స్‌పై ప్రజంటేషన్ ఇస్తారని ఆరోపించారు. బిహార్ ఎన్నికల ప్రచారం చివరి రోజున ప్రజల నుంచి కాకుండా జంతువుల నుంచి ఓట్లు అడగడానికి రాహుల్ అడవికి వచ్చారా అని మధ్యప్రదేశ్ మంత్రి విశ్వాస్ సారంగ్ ప్రశ్నించారు. రాజకీయాలను రాహుల్ గాంధీ ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదని ఆయన విమర్శించారు.

# దేశాన్ని మతప్రాతిపదికన విభజించడమే..

**'కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్' అంటారా?**
**రేవంత్ వ్యాఖ్యలపై రాజ్‌నాథ్ మండిపాటు**
**ఇదీ కాంగ్రెస్ సంస్కృతి.. అంటూ బిహార్ ఎన్నికల ప్రచారంలో ఆగ్రహం**



**ఔరంగాబాద్, నవంబరు 9:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. 'కాంగ్రెస్ అంటే ముస్లింలు' అని ఆయన అన్నారని, ఇది దేశాన్ని మతప్రాతిపదికన విభజించడమేనని చెప్పారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజైన ఆదివారం ఆయన ఔరంగాబాద్, ససరాంల్లో జరిగిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. 'తెలంగాణ సీఎం చెప్పింది విన్నారా? కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్ అని ఆయన అన్నారు. దీని అర్థం ఏమిటి? మత ప్రాతిపదికన దేశాన్ని విభజించే ఉద్దేశంతోనే ఆయన ఆ వ్యాఖ్య చేశారు. ఇవేమి రాజకీయాలు? ఇదీ కాంగ్రెస్ సంస్కృతి' అని విమర్శించారు. రేవంత్‌రెడ్డి గురువారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం సందర్భంగా ఆ వ్యాఖ్య చేశారు. ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు మహమ్మద్ అజహరుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించగా, దానికి సమాధానం ఇచ్చిన రేవంత్ ఆ మాటలు అన్నారు. దాన్నే రాజ్‌నాథ్ సింగ్ బిహార్ ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించారు. కాంగ్రెసవి విభజనపూరిత, బుజ్జగింపు రాజకీయాలని విమర్శించారు. బీజేపీ మాత్రం మానవీయ రాజకీయాలను చేస్తోందని చెప్పారు. ఆర్జేడీ నేత లాలు ప్రసాద్‌ను కూడా ఆయన విమర్శించారు. 'జబ్ తక్ రహేగా సమోసా మే ఆలూ తబ్ తక్ రహేగా బిహార్ మే లాలు' (సమోసాలో ఎంతవరకు బంగాళాదుంప ఉంటుందో అంతవరకు బిహార్‌లో లాలూ ఉంటారు) అంటూ గతంలో లాలు చేసిన వ్యాఖ్యను ప్రస్తావించారు. ఇప్పుడు సమోసాలో ఆలూను అంతగా పెట్టడం లేదని, జీడిపప్పు ఇతర రుచికరమైన పదార్థాలను పెడుతున్నారని అన్నారు. అందువల్ల ఆ మాటకు కాలం చెల్లిందని చెప్పారు. ఎన్‌డీఏ రుచికరమైన సమోసాలను అందిస్తుందని అన్నారు. అధికారంలోకి వస్తే ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామంటూ ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఇచ్చిన హామీని తప్పు పట్టారు. ఆయనకు లెక్కలేమైనా తెలుసా? జీతాలకు ఎక్కడ నుంచి డబ్బులు తీసుకొస్తారు? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పిస్తూ...ఆయనకు నిజంగా దళితులు, గిరిజనులు, మైనార్టీలపై అంత శ్రద్ధ ఉంటే ప్రతిపక్ష నేత పదవిని ఆయా వర్గాల వారికి అప్పగించాలని డిమాండు చేశారు.

# భారీ ఉగ్ర కుట్ర భగ్నం

**ముగ్గురిని అరెస్టు చేసిన గుజరాత్ ఏటీఎస్**
**హైదరాబాద్ డాక్టర్, ఇద్దరు యూపీ వాసులు**
**ఆయుధాలు, రసాయనాల స్వాధీనం**
**పలు నగరాల్లో ఉగ్రదాడులకు కుట్ర**
**ఢిల్లీ, లఖ్‌నవూ, అహ్మదాబాద్‌ల్లో రెక్కీ**



**హైదరాబాద్ :** దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో ఉగ్ర దాడులకు పన్నిన కుట్రను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అధికారులు భగ్నం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఒక డాక్టర్‌తోపాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. గుజరాత్ ఏటీఎస్ డీఐజీ సునీల్ జోషి ఆదివారం విలేకరులకు తెలిపిన సమాచారం ప్రకారం.. ప్రమాదకర రసాయనాలు, ఆధునిక ఆయుధాలతో భారీ ఉగ్రదాడికి కుట్ర చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్(35), ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అజాద్ సులేమాన్ షేక్, మహమ్మద్ సుహెయల్ మహమ్మద్ సలీమ్‌లను అరెస్టు చేశారు. మొహియుద్దీన్‌ను గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈ నెల 7న రెండు గ్లోక్ పిస్టళ్లు, ఒక బెరెట్టా పిస్టల్, 30 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, నాలుగు లీటర్ల కాస్టర్ ఆయిల్, రిసిన్ తయారీకి వాడే ముడి పదార్థాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. విచారణలో తాను గాంధీనగర్ జిల్లాలో మారుమూల ఉన్న కలాల్ ప్రాంతంలో ఈ ఆయుధాలను అందుకున్నట్లు అతడు వెల్లడించాడు. ఉగ్ర కార్యకలాపాలు చేపట్టేందుకే వీటిని సేకరిస్తున్నట్లు తెలిపాడు. ఆన్‌లైన్‌లో కన్సల్టెంట్ డాక్టర్‌గా పనిచేసే క్రమంలో ఉగ్రవాదులతో ఇతడికి పరిచయం ఏర్పడింది. ఐఎస‌కేపీ(ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ ప్రావిన్స్)కు చెందిన అబూ ఖదీజా(అఫ్గనిస్థాన్) ఇతడితో సంప్రదింపులు జరుపుతున్నాడని గుర్తించారు. ఖదీజాకు పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయి. చైనాలో వైద్యవిద్య చదివిన మొహియుద్దీన్ దేశంలో భారీ ఉగ్రదాడులు జరిపేందుకు అత్యంత విషపూరితమైన రిసిన్‌ను తయారుచేసే పనిలో ఉన్నట్లు గుజరాత్ ఏటీఎస్ డీఐజీ చెప్పారు. అతడి ఫోన్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా అతడికి ఆయుధాలు అందించిన యూపీకి చెందిన అజాద్ సులేమాన్ షేక్, మహమ్మద్ సుహెయల్ మహమ్మద్ సలీమ్‌లను గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని హనుమాన్‌గఢ్‌లో సేకరించిన ఆయుధాలను వీరు మొహియుద్దీన్‌కు అందించారు. పాకిస్థాన్‌లోని వీరి హ్యాండ్లర్ డ్రోన్ ద్వారా ఆ ఆయుధాలను పంపాడని డీఐజీ వెల్లడించారు. కాగా వీరు ఉగ్రదాడులు జరిపేందుకు లఖ్‌నవూ, ఢిల్లీ, అహ్మదాబాద్‌లలోని పలు రద్దీ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. మొహియుద్దీన్ అరెస్టుతో నగరంలోని రాజేంద్రనగర్ సర్కిల్ ఫోర్ట్‌వ్యూ కాలనీవాసులు ఉలిక్కిపడ్డారు. ఇతడు నివాసం ఉంటున్నది ఈ కాలనీలోనే. ఉప్పర్‌పల్లి ఫోర్ట్‌వ్యూ కాలనీ రోడ్డు నెంబరు 9లోని ఆషాద్ మంజిల్ మొదటి అంతస్తులో ఇతడు నివాసం ఉంటున్నట్లు సమాచారం.

**ఎక్కడ ఉగ్ర కార్యకలాపాలు వెలుగులోకి వచ్చినా హైదరాబాద్‌కు లింకులు**

దేశంలో ఎక్కడ ఎప్పుడు ఉగ్ర కార్యకలాపాలు వెలుగులోకి వచ్చినా.. ఎక్కడ ఉగ్రవాద సానుభూతిపరులు అరెస్టయినా హైదరాబాద్ నగరంతో వారికి ఏదో ఒక లింకు ఉంటోంది. హైదరాబాద్ నగరం ఉగ్రవాదులకు ఒక షెల్టర్ జోన్‌గా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతేడాది సెప్టెంబరులో ఐఎస(ఇస్లామిక్ స్టేట్) ఉగ్రవాద సంస్థకు చెందిన యువకుడు రిజ్వాన్ అలీ నగరానికి వచ్చి ఆశ్రయం పొంది తలదాచుకున్నట్లు ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. ఇతడు సైదాబాద్‌లోని శంకేశ్వర బజార్‌లో సుమారు ఆరు నెలలపాటు తలదాచుకున్నట్లు ఎన్ఐఏ అధికారుల విచారణలో తేలింది.

గతేడాది నగరంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే ఒక సదస్సు సికింద్రాబాద్‌లోని ఓ హోటల్లో జరిగినా.. పోలీసు నిఘా వ్యవస్థ కనిపెట్టలేక పోయిందనే చర్చ జరుగుతోంది. మహారాష్ట్ర సహా.. వివిధ ప్రాంతాల నుంచి 150 మంది ఇస్లామిక్ సానుభూతిపరులు హోటల్లో దిగి నెల రోజులపాటు మత విద్వేష సదస్సును ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహించారంటే.. నగరాన్ని వారు ఎంత సేఫ్టీ జోన్‌గా వాడుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ సదస్సుకు హాజరైన ఓ యువకుడు ముత్యాలమ్మ ఆలయంలోకి వెళ్లి అమ్మవారి విగ్రహాన్ని కాలితో తన్ని ధ్వంసం చేశాడు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
10 నవంబర్
2025




# నితీశ్ చోటుకు ఎసరు

## జురెల్‌కు బెర్త్ ఖరారే

## దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్






న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో జరుగబోయే రెండు టెస్టుల సిరీసకు ముందు వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ అద్భుత ఫామ్‌ను చాటుకున్నాడు. దక్షిణాఫ్రికా 'ఎ' జట్టుతో జరిగిన రెండో అనధికార టెస్టులో అతను రెండు ఇన్నింగ్స్‌లోనూ అజేయ శతకాలతో ఆకట్టుకున్నాడు. దీంతో ఈనెల 14 నుంచి జరిగే తొలి టెస్టులో అతడికి తుది జట్టులో చోటు ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొంది. గతంలో పంత్ గాయం కారణంగా ఇంగ్లండ్ పర్యటనలో ఐదో టెస్టు, విండీసతో రెండు టెస్టులకు జురెన్ ప్రధాన కీపర్‌గా వ్యవహరించాడు. అయితే పంత్ ఇప్పుడు గాయం నుంచి కోలుకుని టెస్టు జట్టులో వైస్‌కెప్టెన్ హోదాలో ఉన్నాడు. కాబట్టి కీపర్‌గా పంత్ కొనసాగడం ఖాయమే. అయితే ఫామ్‌లో ఉన్న జురెల్‌ను ఎక్కడ ఆడించాలనేది కోచ్ గంభీర్‌కు సవాల్ కానుంది. దేశవాళీ సీజన్ ఆరంభమైనప్పటి నుంచి అతడి చివరి 8 ఫస్ట్‌క్లాస్ ఇన్నింగ్స్‌ల్లో 631 రన్స్ సాధించాడు. ఈనేపథ్యంలో జురెల్‌ను బెంచీకే పరిమితం చేస్తే విమర్శలు తప్పవు.

**ఎవరి స్థానానికి ఎసరు?**

తొలి టెస్టులో జురెల్‌ను స్పెషలిస్ట్ బ్యాటర్‌గా బరిలోకి దించితే ఎవరి స్థానంలో ఆడతాడనేది చర్చనీయాంశమవుతోంది. ఇందుకు వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌లలో ఒకరిని తప్పించాల్సి ఉంటుంది. అయితే చివరి టెస్టులో సాయి హాఫ్ సెంచరీ సాధించాడు. ఇక మిగిలింది నితీశ్ కుమార్ చోటే. స్వదేశీ పిచ్‌లపై అతడి బౌలింగ్ జట్టుకు పెద్దగా అవసరం పడకపోవచ్చు. అలాగే జురెల్ ఫామ్‌తో పోలిస్తే నితీశ్‌ను తుది జట్టులోకి తీసుకుని ఆడించడం కష్టమే. దీనికి తోడు నితీశ్ గతనెలలో విండీసతో జరిగిన తొలి టెస్టులో కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే బౌలింగ్ వేశాడు. ఇక రెండో టెస్టులో బ్యాటింగ్‌లో 43 పరుగులు చేసినా.. ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో నితీశ్ స్థానంలో జురెల్‌ను ఆడించడం ఖాయంగానే కనిపిస్తోంది. ఒకవేళ అదే జరిగితే 1986లో కిరణ్ మోరే, చంద్రకాంత్ పండిట్‌ల తర్వాత భారత తుది జట్టులో ఇద్దరు స్పెషలిస్ట్ కీపర్లు బరిలోకి దిగినట్టవుతుంది.

**ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి?**

రెండో అనధికార టెస్టులో భారత్ 'ఎ' విధించిన 417 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 'ఎ' ఛేదించడం భారత టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆలోచనలో పడేసింది. సిరాజ్, ఆకాశ్, ప్రసిద్ధ్, కుల్దీపలాంటి బౌలర్లను దీటుగా ఎదుర్కొని భారీ ఛేదనను పూర్తి చేయడంతో బౌలింగ్ లైన్‌పపై కోచ్ దృష్టి సారించాడు. ప్రధాన పేసర్లుగా జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్‌లు ఆడడం దాదాపు ఖాయమే. ఇక బ్యాటర్‌గా జురెల్‌ను తీసుకుంటే ముగ్గురు స్పిన్నర్లు జడేజా, సుందర్, కుల్దీప్ తుది జట్టులో ఉంటారు.



## భారత్ 'ఏ'పై దక్షిణాఫ్రికా 'ఏ'

# భారీ విజయం

### 417 పరుగుల లక్ష్యం ఉఫ్..

బెంగళూరు : భారత్ 'ఏ'తో జరిగిన రెండో అనధికారిక టెస్టు పోరులో దక్షిణాఫ్రికా 'ఏ' అద్భుత విజయం సొంతం చేసుకుంది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్ కాస్తా 1-1తో సమమైంది. యువ భారత్ నిర్దేశించిన 417 పరుగుల భారీ లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఛేదన కోసం ఓవర్‌నైట్ స్కోరు 25/0తో ఆదివారం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన సఫారీలు..భారత బౌలర్లకు చుక్కలు చూపెట్టారు. పసలేని భారత్ 'ఏ' బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ ఐదుగురు బ్యాటర్లు అర్ధసెంచరీలతో కదంతొక్కారు. ఓపెనర్లు హెర్మన్(91), సెనోవేన్(77) అర్ధసెంచరీలతో జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని అందించారు.

దక్షిణాఫ్రికాతో త్వరలో జరుగబోయే టెస్టు సిరీస్‌కు సన్నాహకంగా జరిగిన ఈ పోరులో మన బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. ఆకాశ్‌దీప్(1/106), హర్ష్ దూబే(1/111) ధారళంగా పరుగులు సమర్పించుకున్నారు. హెర్మన్ నిష్క్రమణతో తొలి వికెట్‌కు 156 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడగా, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జుబెర్ హమ్జా(77), తెంబా బవుమా(59), కానర్ ఏస్తర్‌జెన్(52 నాటౌట్) అర్ధసెంచరీలతో అలవోకగా లక్ష్యాన్ని ఛేదించారు. ప్రసిద్ధ్ కృష్ణ(2/49) రెండు వికెట్లు తీయగా, సిరాజ్(1/53) సత్తాచాటలేకపోయాడు. అకెర్‌మన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', జురెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి.

# అనిషాకు రజతం

### వరల్డ్ షూటింగ్ ఛాంపియన్‌షిప్




కైరో (ఈజిప్ట్): వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్సలో భారత షూటర్ అనీష్ భన్వాల్ రజతం సాధించాడు. ఆదివారం జరిగిన పురుషుల 25 మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో అనీష్ మొత్తం 28 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. బెస్సాగ్వెట్ (ఫ్రాన్స్) స్వర్ణం.. హెరోడైనెట్స్ (ఉక్రెయిన్) కాంస్యం దక్కించుకొన్నారు. వరల్డ్ చాంపియన్‌షిపలో 25మీటర్ల ర్యాపిడ్‌ఫైర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో పతకం సాధించిన తొలి భారత షూటర్‌గా అనీష్ రికార్డుల్లోకి ఎక్కాడు. కాగా క్వాలిఫయింగ్ రౌండ్‌లో 585 పాయింట్లతో రెండో స్థానం సొంతం చేసుకొన్న అనీష్ ఫైనల్‌కు అర్హత సాధించాడు.



# కివీస్‌దే విజయం

నెల్సన్(న్యూజిలాండ్) : వెస్టిండీస్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ ముందంజ వేసింది. ఆదివారం జరిగిన మూడో టీ20లో కివీస్ 9 పరుగుల తేడాతో విండీస్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలున్న సిరీస్‌లో కివీస్ ప్రస్తుతం 2-1 ఆధిక్యంలో కొనసాగుతున్నది. కివీస్ నిర్దేశించిన 178 పరుగుల లక్ష్యఛేదనలో విండీస్ 19.5 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. విజయానికి ఆరు బంతుల్లో 12 పరుగులు అవసరమైన దశలో కైల్ జెమీసన్(1/35) మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. తన అద్భుత బౌలింగ్‌తో జెమీసన్ ఐదు బంతుల్లో రెండు పరుగులే ఇచ్చి రొమారియో షెఫర్డ్ వికెట్ తీసి కివీస్‌కు విజయాన్ని అందించాడు. జాకబ్ డఫీ (3/36), ఇష్ సోధి(3/34) మూడేసి వికెట్లు తీశారు. తొలుత డేవాన్ కాన్వె (56) అర్ధషెంచరీకి తోడు డారిల్ మిచెల్ (41) రాణించడంతో కివీస్ 20 ఓవర్లలో 177/9 స్కోరు చేసింది. మాథ్యూ ఫోర్డె (2/20), జాసన్ హెూల్డర్ (2/31) రెండు వికెట్లు పడగొట్టారు. సోధీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.



# జొకో 101

ఏథెన్స్ : సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో ఘనత సాధించాడు. కెరీర్‌లో 101వ ఏటీపీ సింగిల్స్ టైటిల్ అందుకున్నాడు. ఉత్కంఠ భరితంగా జరిగిన హెలినిక్ చాంపియన్‌షిప ఫైనల్లో జొకో 4-6, 6-3, 7-5తో లొరెంజో ముసేటి (ఇటలీ)ని ఓడించి విజేతగా నిలిచాడు. ఓపెన్ ఎరాలో జొకోకంటే ముందు జిమ్మీ కానర్స్ (109), రోజర్ ఫెడరర్ (103) ఏటీపీ సింగిల్స్ టైటిళ్ల సెంచరీ కొట్టారు. అంతేకాదు..38 ఏళ్ల జొకో హార్డ్‌కోర్టులపై 72వ సింగిల్స్ టైటిల్‌తో మరో రికార్డునూ తన ఖాతాలో వేసుకున్నాడు. ఈక్రమంలో రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్) పేరిట 71 సింగిల్స్ టైటిళ్లతో ఉన్న రికార్డును నొవాక్ బద్దలుకొట్టాడు. కాగా.. వరుసగా రెండో సంవత్సరమూ సీజన్ ముగింపు టోర్నమెంట్ ఏటీపీ ఫైనల్స్ నుంచి జొకోవిచ్ వైదొలిగాడు. భుజం గాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు నొవాక్ ప్రకటించాడు. పురుషుల విభాగంలో టాప్-8 ఎనిమిది మంది ఏటీపీ ఫైనల్స్‌లో తలపడుతున్నారు.

# రాధేష్ సెంచరీ

హైదరాబాద్: రాహుల్ రాధేష్ (129) సెంచరీతో ఆదుకోవడంతో.. గ్రూప్-డిలో రాజస్థాన్‌తో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ మెరుగైన స్కోరు సాధించింది. ఆటకు రెండో రోజు ఓవర్ నైట్ స్కోరు 295/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 364 పరుగులకు ఆలౌటైంది. క్రితంరోజు బ్యాటర్ రోహిత్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రాహుల్ చాహర్, అశోక్ శర్మ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 221/5 స్కోరు చేసింది. ఆదివారం ఆట ఆఖరుకు కునాల్ సింగ్ (64 బ్యాటింగ్), అజయ్ సింగ్ (42 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. తనయ్, అనికేత్ చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. హైదరాబాద్ మొదటి ఇన్నింగ్స్ స్కోరుకు రాజస్థాన్ ఇంకా 143 పరుగులు వెనుకంజలో ఉంది.




# 8 బంతుల్లో 8 సిక్సర్లు

## 11 బంతుల్లో హాఫ్ సెంచరీ

## మేఘాలయ క్రికెటర్ ఆకాశ్ వరల్డ్ రికార్డు

## అరుణాచల్‌తో రంజీ ప్లేట్ మ్యాచ్

సూరత్: ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు బాదితే అద్భుతమనుకున్నాం. కానీ మేఘాలయ క్రికెటర్ ఆకాశ్ చౌధరి అంతకు మించి అన్నట్టుగా.. వరుసగా 8 బంతుల్లోనూ సిక్సర్లు బాది వరల్డ్ రికార్డు నెలకొల్పాడు. అంతేకాకుండా అతడి దూకుడైన ఆటతీరుకు 11 బంతుల్లోనే వేగవంతమైన హాఫ్ సెంచరీ కూడా పూర్తయ్యింది. దీంతో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒకేసారి రెండు రికార్డులను నమోదు చేసిన బ్యాటరయ్యాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఆకాశ్ మొత్తం 14 బంతుల్లో 8 సిక్సర్లతో 50 పరుగులు చేసి నాటౌట్‌గా మిగిలాడు. గతంలో 12 బంతుల్లో లెస్టర్‌షైర్ ఆటగాడు వేన్ వైట్ ఫాస్టెస్ట్ ఫిఫ్టీ సాధించాడు. అరుణాచల్‌ప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ప్లేట్ మ్యాచ్ రెండో రోజు ఆదివారం ఆటలో ఆకాశ్ ఎనిమిదో నెంబర్ బ్యాటర్‌గా బరిలోకి దిగాడు. స్పిన్నర్ లిమార్ దాబి వేసిన ఓవర్‌లో ఆరు సిక్సర్లు బాదగా, ఆ తర్వాత ఓవర్‌లోనూ తొలి రెండు బంతులను బౌండరీకి దాటించి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 628/6 స్కోరు దగ్గర డిక్లేర్ చేసింది. అటు అరుణాచల్ ప్రదేశ్ 73 పరుగులకే ఆలౌటై.. ఫాలోఆన్‌లోనూ 29/3 స్కోరుతో ఓటమి వైపు పయనిస్తోంది.

**ఎవరీ ఆకాశ్?:**

2019లో అరంగేట్రం చేసిన 25 ఏళ్ల ఆకాశ్ ఈ మ్యాచ్‌కు ముందు 30 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 14.37 సగటుతో 503 పరుగులు సాధించగా, ఇందులో రెండు హాఫ్ సెంచరీలు మాత్రమే ఉన్నాయి. పేసర్‌గా రాణించే తను 87 వికెట్లు పడగొట్టాడు. అయితే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో గతంలో సోబర్స్, రవిశాస్త్రి మాత్రమే ఆరు బంతుల్లో ఆరు సిక్సర్ల ఫీట్‌ను సాధించారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News




# మృణాల్ చేతిలో అదొక్కటే..

బాలీవుడ్ లో సీరియల్స్ చేసి ఆ క్రేజ్ తో సిల్వర్ స్క్రీన్ ఛాన్స్ లు అందుకున్న మృణాల్ ఠాకూర్ తెలుగులో సీతారామం సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. హను రాఘవపూడి డైరెక్షన్ లో తెరకెక్కిన సీతారామం సినిమా సూపర్ హిట్ అవ్వడంతో మృణాల్ ఠాకూర్ కి తెలుగులో మంచి పాపులారిటీ వచ్చింది. ఆ నెక్స్ట్ నానితో హాయ్ నాన్న చేసి మెప్పించింది మృణాల్ ఐతే థర్డ్ ప్రయత్నంగా విజయ్ దేవరకొండతో ఫ్యామిలీ స్టార్ సినిమా చేసింది కానీ అది వర్క్ అవుట్ అవ్వలేదు. 3 సినిమాలు తీస్తే రెండు హిట్లు ఒక ఫ్లాప్ పడగా అయినా కూడా మృణాల్ కి తెలుగులో సరైన అవకాశాలు రావట్లేదు. నిజంగానే మృణాల్ కి ఛాన్స్ లు రావట్లేదా ఒకవేళ వచ్చినా ఆమె కాదంటుందా అన్నది తెలియదు కానీ మృణాల్ ఠాకూర్ చేతిలో ఒకే ఒక్క తెలుగు సినిమా ఉంది. అది కూడా ముందు ఒక హీరోయిన్ తో ఆ ప్రాజెక్ట్ అనుకుని టీజర్ కూడా చేశాక మధ్యలో ఆ హీరోయిన్ హ్యాండ్సప్ చెప్పడంతో మృణాల్ కి ఛాన్స్ దక్కింది. ఒకవేళ ఆ హీరోయిన్ కొనసాగి ఉంటే ఆ అవకాశం కూడా ఉండేది కాదు. మృణాల్ ఠాకూర్ డెకాయిట్ సినిమా నెక్స్ట్ ఇయర్ మార్చిలో రిలీజ్ అవుతుంది. ఈ సినిమాతో పాటు అల్లు అర్జున్ అట్లీ కాంబో సినిమాలో ఒక రోల్ చేస్తుందని వార్తలు వస్తున్నాయి కానీ అది అఫీషియల్ అనౌన్స్ మెంట్ రాలేదు. ఐతే తెలుగులో పరిస్థితి ఇలా ఉండగా ఇంకా బాలీవుడ్ లో మృణాల్ తన ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అక్కడ స్టార్ అవ్వాలన్న తన కల కోసం మృణాల్ ఎలాంటి ఆఫర్ వచ్చినా కాదనకుండా చేస్తుంది.



# ఫోటోలు మార్ఫింగ్‌లో అసలు నిజం తెలుసుకుని షాకైన అనుపమ

రీసెంట్ టైమ్స్ లో ఇంటర్నెట్ ను విచ్చలవిడిగా వాడటం బాగా అలవాటుగా మారిపోయింది. ఇంటర్నెట్ ను వాడుతూ ఎలాంటి భయం లేకుండా ఎంతకైనా తెగించడం చాలా కామనైపోయింది. అందులో భాగంగానే ఈ మధ్య కాలంలో సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో స్టార్ల పేరిట ఫేక్ అకౌంట్స్ క్రియేట్ చేసి వాళ్ల ఫోటోలను డిపీలుగా పెట్టుకుని కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. కొందరు.. సెలబ్రిటీల ఫేమ్ ను వాడుకుంటూ మోసం చేస్తుంటే, మరికొందరు సెలబ్రిటీల ఫోటోలను మార్ఫింగ్ చేసి ఆన్‌లైన్ లో వైరల్ చేస్తూ వారిని ఇబ్బంది పెడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ దారుణాలు పెరిగిపోయాయి. అందుకే వాటిని భరించలేక సెలబ్రిటీలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులు చేయడం, కోర్టుకు వెళ్లడం లాంటివి చేస్తున్నారు. ఇప్పుటు సౌత్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ కు కూడా ఇలాంటి ఇబ్బందే ఎదురైంది. అనుపమ ఫోటోలను మార్ఫింగ్ చేసి, ఆమె ఫ్యామిలీ, ఫ్రెండ్స్ అకౌంట్స్ కు ట్యాగ్ చేస్తుండటం ఎక్కువవడంతో అనుపమ ఈ విషయంపై కేరళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా ఈ ఘటనపై స్పందిస్తూ అనుపమ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, తన గురించి అలా అసభ్యకర పోస్టులు చేసిందెవరో తెలిసిపోయిందంటూ పోస్ట్ చేశారు. ఆ పోస్ట్ లో అనుపమ ఇలా రాసుకొచ్చింది. కొన్నాళ్ల కిందట తన గురించి తప్పుడు వార్తలను, మార్ఫింగ్ ఫోటోలను పంచుతున్న ఓ అకౌంట్ కనిపించిందని, అదే వ్యక్తి ఎన్నో ఫేక్ అకౌంట్స్ ను క్రియేట్ చేసి, తనపై అవమానకార కామెంట్స్ చేస్తూ హేట్రెడ్ ను స్ప్రెడ్ చేశారని, దీంతో తాను కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశానని, విచారణలో ఇదంతా చేస్తున్నది ఒక 20 ఏళ్ల అమ్మాయి అని తెలిసి తాను షాకైనట్టు అనుపమ రాసుకొచ్చారు.

ఆమె వయసును దృష్టిలో ఉంచుకుని ఆమె ఎవరనేది తాను బయటపెట్టాలనుకోవడం లేదని, కానీ చట్టపరమైన చర్యలు మాత్రం తీసుకుంటానని చెప్పిన అనుపమ, సెలబ్రిటీలకు కూడా సాధారణ మనుషుల్లానే హక్కులుంటాయని, ఆన్‌లైన్ వేధింపులు శిక్షార్హ నేరమని పేర్కొన్నారు. ఈ విషయం ద్వారా తానో విషయం చెప్పాలనుకుంటున్నానని, స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్ కు యాక్సెస్ ఉన్నంత మాత్రాన ఇతరులను వేధించడం, వారి పరువు తీస్తూ, ద్వేషాన్ని వ్యాప్తి చేసే హక్కు ఎవరికీ ఉండదని, ఆన్ లైన్ లో చేసే ప్రతీ పనికి జవాబుదారీతనం తప్పదని అనుపమ చెప్పారు. ఇక అనుపమ కెరీర్ విషయానికొస్తే ఈ ఇయర్ అనుపమ ఏకంగా ఆరు సినిమాలు చేసింది. త్వరలో అనుపమ లాక్‌డౌన్ అనే తమిళ సినిమాలో కనిపించనున్నారు.



# రామ్ తో సమ్ థింగ్ సమ్ థింగ్..

టాలీవుడ్ యంగ్ హీరో, ఎనర్జిటిక్ స్టార్ రామ్.. ఇప్పుడు ఆంధ్రా కింగ్ తాలుకా మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఓ హీరో వీరాభిమాని కథగా రూపొందుతున్న ఆ సినిమాకు మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ఫేమ్ పి.మహేష్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. సినిమాలో యంగ్ అండ్ క్రేజీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తుండగా.. రామ్ తో ఆమెకు ఆన్ స్క్రీన్ లవ్ తోపాటు ఆఫ్ స్క్రీన్ లవ్ షూటింగ్ టైమ్ లో స్టార్ట్ అయిందని కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో రూమర్లు వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే భాగ్యశ్రీ ఓసారి క్లారిటీ ఇచ్చినప్పటికీ.. ఎప్పటికప్పుడు వార్తలు వస్తూనే ఉన్నాయి. రీసెంట్ గా సీనియర్ నటుడు జగపతి బాబు హోస్ట్ చేస్తున్న జయమ్ము నిశ్చయమ్మురా టాక్ షోకు రామ్ గెస్ట్ గా విచ్చేశారు. ఆ సమయంలో ఏమైనా అఫైర్స్ ఉన్నాయా అని పరోక్షంగా క్వశ్చన్ వేశారు జగ్గూ భాయ్. దీంతో రిలేషన్ షిప్స్ విషయానికొస్తే.. తాను ఎప్పుడూ గోప్యంగా ఉంచడానికి ఇష్టపడతానని, అది తన పర్సనల్ మ్యాటర్ అని తెలిపారు. ఆ తర్వాత భాగ్యశ్రీ కేవలం హీరోయిన్ మాత్రమేనా లేక ఇంకేమైనా ఉందా అని జగ్గూ భాయ్.. మరో ప్రశ్న వేయగా, నవ్వుతూ ఊరుకున్నారు రామ్. దీంతో రామ్, భాగ్యశ్రీ లవ్ కు సంబంధించిన ఊహాగానాలు మళ్లీ ఊపందుకున్నాయి. ఇప్పుడు భాగ్యశ్రీ కూడా అలాంటి క్వశ్చన్ కు ఆన్సర్ ఇవ్వకుండా సైలెంట్ గా నవ్వడం హాట్ టాపిక్ గా మారింది. ఆంధ్రా కింగ్ తాలుకా మూవీ ప్రమోషన్స్ లో భాగంగా ఇటీవల చిట్ చాట్ నిర్వహించారు భాగ్యశ్రీ. ఆ సమయంలో రామ్ ను యాంకర్ శ్రీముఖి ఇంట్రావర్ట్ అంటూ వర్ణించింది. దీంతో భాగ్యశ్రీ.. తాను అది నిజం కాదని అనుకుంటున్నట్లు చెప్పారు. అయితే మరి మీతో రామ్ ఎలా ఉంటున్నారని శ్రీముఖి.. హీరోయిన్ ను అడిగింది. తనతో ఎక్స్ట్రావర్ట్ అని అనుకుంటున్నట్లు భాగ్యశ్రీ చెప్పగా.. వెంటనే శ్రీముఖి వారిని ఆట పట్టించింది. ఇద్దరి మధ్య సమ్ థింగ్.. సమ్ థింగ్ అంటూ వ్యాఖ్యానించింది. కానీ భాగ్యశ్రీ ఎలాంటి ఆన్సర్ ఇవ్వకుండా నవ్వేశారు. దీంతో నిజంగా సమ్ థింగ్ సమ్ థింగ్ ఉందని.. అనేక మంది నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.అసలు వారిద్దరూ మధ్య ఏమైనా ఉందా లేదా అనేది వారికే తెలియాలి.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986